
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
గురువారం, 24 ఏప్రిల్ 2025



ఖమ్మంలో కొవ్వొత్తుల ప్రదర్శనలో మేయర్ నీరజ, కాంగ్రెస్ శ్రేణులు



ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం చేస్తున్న సీపీఐ నాయకులు



సీపీఎం ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

పహల్గాం నరమేధంపై నిరసన

- ఖమ్మంలో కాంగ్రెస్, వామపక్షాల ఆధ్వర్యంలో ర్యాలీలు
- కొత్తగూడెంలో భిన్న వర్గాల ప్రజల ప్రదర్శన
- ఉగ్రవాదుల దిష్టిబొమ్మల దహనం

6

జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో 26 మంది పర్యాటకులను ఉగ్రవాదులు కాల్చిచంపిన ఘటనను నిరసిస్తూ ఇరుజిల్లాల్లో వివిధ పార్టీల ఆధ్వర్యంలో ప్రదర్శనలు నిర్వహించారు. ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు చేసి ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. కొత్తగూడెంలో నల్లబ్యాడ్జీలు ధరించి ర్యాలీ నిర్వహించారు.



ఈ లిఫ్ట్‌ను బాగు చేయించేదెవరు..?

ఖమ్మం జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ వార్డు, క్యాథ్‌లాబ్‌కు అనుసంధానంగా ఏర్పాటు చేసిన లిఫ్ట్ గత నెల రోజులుగా మూలనపడింది. లిఫ్ట్ పనిచేయకపోవడం వల్ల ఆరోగ్యశ్రీ వార్డులో రోగులకు, క్యాథ్‌లాబ్‌లో స్టంట్లు వేసిన రోగులను పై అంతస్థుకు తీసుకెళ్లాలంటే అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నెల రోజులుగా లిఫ్ట్ మరమ్మతులకు గురైనా అధికారులు పట్టించుకోకపోవడం పట్ల రోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆస్పత్రి పరిస్థితే ఇలా ఉంటే.. ఇక గ్రామాల్లోని ఆస్పత్రుల పరిస్థితి ఏమిటో?

-ఆంధ్రజ్యోతి, ఖమ్మం కలెక్టరేట్

రబీ ధాన్యం కొనుగోళ్లు ముందుకు సాగటం లేదు. ప్రారంభించిన కొనుగోలు కేంద్రాలు అలంకారప్రాయంగా మారాయి. ఎక్కడ కూడా గింజ ధాన్యం కొనుగోళ్లు జరగటం లేదు. దీన్ని సాకుగా తీసుకున్న వ్యాపారులు తరుగు తీస్తేనే కొనుగోళ్లు చేస్తామని మొండికేస్తున్నారు. కొందరు మిల్లర్లు క్వింటాకు ఐదు కేజీలు తీస్తుండగా.. మరికొందరు ఏకంగా పది కిలోలు తీస్తామని చెబుతుండడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.



స్నానాల లక్ష్మీపురంలో రైతులు ఆరబోసుకున్న ధాన్యం

ముందుకు సాగని ధాన్యం కొనుగోళ్లు

- మూడు మిల్లులకే ధాన్యం కేటాయింపులు
- రద్దీ పెరగడంతో తరుగుకు తెగబడుతున్న మిల్లర్లు
- లారీలు అన్‌లోడింగ్ జరగక కొనుగోళ్లపై ప్రభావం
- ఆందోళనలో అన్నదాతలు

వైరా, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లు ముందుగా వైరా మండలం గరికపాడు సొసైటీ పరిధిలో ధాన్యం కొనుగోళ్లు మొదలయ్యాయి. అక్కడ మూడ్నాలుగు రోజులపాటు కొనుగోళ్లు సాఫీగానే జరిగాయి. ఆ తర్వాత నుంచి కొర్రీలు మొదలయ్యాయి. ఇదే తరుణంలో గత వారం రోజుల వ్యవధిలో ఈదురుగాలులతో కూడిన మూడు భారీ వర్షాలు కురిశాయి. ఈ వర్షాలను సాకుగా చూపించి ధాన్యం నాణ్యతపై పేచీలు పెడుతూ క్వింటా ఒక్కంటికి ఐదుకిలోల కటింగ్ పెడితేనే దిగుమతి చేసుకుంటామని మిల్లర్లు పేచీ పెడుతున్నారు. చివరికి ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ జోక్యంతో ఒకట్రెండు రోజులు మిల్లర్లు దారికొచ్చినట్లు నటించి

అలంకారప్రాయంగా కేంద్రాలు

ఆ తర్వాత పరిస్థితి మళ్లీ యథావిధిగానే తయారైంది.

పార్‌బాయిల్డ్ మిల్లుల కొరత సాకు

జిల్లాలో పార్‌బాయిల్డ్ మిల్లులు కేవలం ఐదు మాత్రమే ఉన్నాయి. వీటిలో మూడు పార్‌బాయిల్డ్ మిల్లులకు మాత్రమే ధాన్యం కేటాయింపులు చేశారు. గతంలో రెండు పార్‌బాయిల్డ్ మిల్లుల వారు ప్రభుత్వం సరఫరా చేసిన ధాన్యాన్ని పక్కదారి పట్టించటంతో వాటిని బ్లాక్ లిస్టులో పెట్టారు. ఇప్పుడు రబీలో దొడ్డురకం ధాన్యమే ఎక్కువగా సాగు చేయడంతో కేవలం మూడు పార్‌బాయిల్డ్ మిల్లులకు వాటిని సరఫరా చేయాల్సిన పరిస్థితి (మిగతా 6వ పేజీలో)

నేడు 'దిశ' సమావేశం

హాజరుకానున్న ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

కొత్తగూడెం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెంలోని కలెక్టరేట్‌లో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు దిశ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ బుధవారం తెలిపారు. ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి కో చైర్మన్ మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు దిశ కమిటీ సభ్యులు, అన్నిశాఖల అధికారులు తదితరులు పాల్గొననున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అన్ని శాఖల అధికారులు తమ శాఖల్లో చేపడుతున్న పనులపై నివేదికలతో సమావేశానికి హాజరుకావాలని అధికారులను ఆదేశించారు.

వడదెబ్బతో ముగ్గురి మృతి

భద్రాచలంలో అత్యధికంగా 43.1 డిగ్రీల ఉష్ణోగ్రత

ఖమ్మం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఖమ్మం జిల్లాలో వడదెబ్బతో బుధవారం ముగ్గురు మృతిచెందారు. జిల్లాలో ఎండలతోపాటు వడగాల్పులు అధికమయ్యాయి. దీంతో జనం తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. భద్రాచలంలో బుధవారం అత్యధికంగా 43.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఖమ్మం జిల్లా పెనుబల్లిలో 43 డిగ్రీలు, నేలకొండపల్లి 42.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదుకాగా మిగిలిన మండలాల్లో 41 నుంచి 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. జిల్లాలో వడదెబ్బతో ముగ్గురు మృతిచెందారు. మధిర పట్టణంలోని రామనాథం వీధిలో నివాసం ఉంటున్న వజ్రాల శేషాచారి(80) వడదెబ్బతో మృతిచెందాడు. ఎండతీవ్రతకు అస్వస్థతకు గురైన శేషాచారి ఒక్కసారిగా కుప్పకూలి మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కల్లూరు అంబేద్కర్ కాలనీకి చెందిన నారుమళ్ల చంద్రకళ (46) కల్లంలో ధాన్యం ఆరబెడుతూ వడదెబ్బకు గురికావడంతో అస్వస్థతకు గురై మృతిచెందింది. కల్లూరు మండలంలోని చిన్నకోరుకొండి గ్రామంలో పి.రామగురు(45) అనే వ్యవసాయ కూలీ వడదెబ్బతో మృతిచెందాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భద్రాచలం 43.1 డిగ్రీలు, పాల్వంచ సీతారామపట్నం 43.0, అశ్వాపురం 43 డిగ్రీల వరకు నమోదైంది.

ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు

- భూ భారతి చట్టం దేశానికి ఆదర్శం
- అన్నిరంగాల్లో పాలేరు నియోజక వర్గ అభివృద్ధికి కృషి
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ఏలువారిగూడెంలో పంచాయతీ భవనం ప్రారంభిస్తున్న మంత్రి

తిరుమలాయపాలెం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించి వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని హస్నాబాద్‌లో సైడ్ డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన, ఏలువారిగూడెంలో నూతనంగా పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని, దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా అనేక సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందన్నారు. అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. పాలేరు నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. ప్రతి గ్రామానికి సాగు, తాగు నీరు, విద్యా, వైద్యం రహదారుల సౌకర్యం కల్పించి ఆదర్శ నియోజకవర్గంలో తీర్చిదిద్దుతానన్నారు. గత ఎన్నికల్లో ఈ ప్రాంత ప్రజలు ఆదరించారని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తానన్నారు. భూ సమస్యల పరిష్కారానికి



నగరంలో మామిడి పండ్ల రైతు బజార్

ఖమ్మం వ్యవసాయం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రోటరీనగర్‌లో గల వీధి వ్యాపారుల ప్రాంగణంలో 'మామిడి రైతు బజార్' ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. జిల్లా ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో గురువారం నుంచి ఈ రైతు బజార్ ప్రజలకు అందుబాటులోకి రానుంది. సహజ సిద్ధంగా పండించిన కార్బైడ్ రహిత మామిడి పండ్లను ఇక్కడ విక్రయిస్తారు. వివిధ రైపనింగ్ చాంబర్లలో సహజ సిద్ధంగా మాగించిన మామిడి పండ్లను రైతులు నేరుగా తీసుకువచ్చి ఇక్కడ అమ్ముతారని ఉద్యాన అధికారి ఎం.వి.మధుసూదన్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశాల ప్రకారం ఈ రైతు బజార్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

రచ్చకెక్కిన కాంగ్రెస్ వర్గ పోరు

- పెద్దమ్మతల్లి సాక్షిగా భట్టి, పొంగులేటి వర్గీయుల విభేదాలు
- 'పాలక మండలి' కోసం కొనసాగిన పంతాలు
- చివరకు పొంగులేటి వర్గానిదే పైచేయి
- పార్టీలో చర్చనీయాంశంగా మారిన ఆధిపత్య పోరు
- సంక్లిష్టంగా మారనున్న నామినేటెడ్ పదవుల భర్తీ
- కాంగ్రెస్ శ్రేణుల్లో అయోమయం



పాల్వంచరూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని ప్రసిద్ధ కనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయ పాలక మండలి నియామకంపై చోటుచేసుకున్న రాజకీయ రగడ చర్చనీయాంశంగా మారింది. పాలకమండలి విషయంలో మంత్రి పొంగులేటి, ఉప ముఖ్యమంత్రి భట్టి వర్గీయులు ఎవరికి వారే ఆధిపత్య పోరుకు తలపడటం రాజకీయంగా కలకలం రేపింది. చివరకు మంత్రి పొంగులేటి వర్గమే పైచేయి సాధించడం చర్చకు దారి తీసింది. ఆలయ చరిత్రలో పాలకమండలి నియామకంపై అధికార పార్టీలోని ఇద్దరు మంత్రుల వర్గీయుల మధ్య విభేదాలు చోటుచేసుకోవడం ఇదే ప్రథమం.

దేవాదాయశాఖ 1985 నుంచి పెద్దమ్మతల్లి ఆలయానికి పాలక మండలిని నియమిస్తోంది. అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం 2003లో పాలక మండలి చైర్మన్‌ను ఏకగ్రీవంగా నియమించింది. నాటినుంచి 2023 వరకు పాలక మండలి చైర్మన్, కమిటీ సభ్యుల నియామకంపై రాజకీయ ప్రభావం అంతంత మాత్రంగానే ఉంది. పదవుల భర్తీ విషయంలో అధిష్ఠానం నిర్ణయానికే కట్టుబడి ఉండేవారు. అయితే ఈ దఫా పాలక మండలి చైర్మన్ కోసం డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిల వర్గీయుల మధ్య ఆధిపత్య పోరు ఏర్పడింది. తొలుత మంత్రి పొంగులేటి వర్గీయులు చైర్మన్ పదవి కోసం తమ రాజకీయ పలుకుబడిని ఉపయోగించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రితోపాటు దేవాదాయశాఖ మంత్రి దాక వెళ్లారు. చైర్మన్‌తో పాటు సభ్యుల నియామకం తమదేనని నమ్మకంతో ఉండగా, భట్టి వర్గీయులు చాపకింద నీరులా తమ రాజకీయ చాతుర్యాన్ని ప్రదర్శించారు. గత మార్చి 6న భట్టి వర్గానికి చెందిన జమ్ముల రాజశేఖర్.. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్య, భట్టి విక్రమార్కతో పాటు ఇన్‌చార్జి మంత్రి, దేవాదాయశాఖ మంత్రులను కలిసి వారి నియామక ఉత్తర్వులను అధికారికంగా తీసుకొచ్చారు. దేవస్థానం అధికారులను ఆశ్రయించి ప్రమాణ స్వీకారానికి రంగం సిద్ధం చేసుకున్నారు. అయితే ఈ సమాచారాన్ని పొంగులేటి వర్గీయులు మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గంలో మొదటి నుంచి మీ వెంట ఉంటూ కార్యక్రమాలు నిర్వహిస్తున్న తమకు పాలకవర్గంలో స్థానం దక్కలేదని మొరపెట్టుకున్నారు. ఈ క్రమంలో మంత్రి పొంగులేటి (మిగతా 6వ పేజీలో)

విద్యాశాఖలో ఉద్యోగులకు ఉద్వాసన

- 41మంది కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల తొలగింపు..
- డీఎస్సీ- 2008 నియామకాలకు తాత్కాలిక బ్రేక్..

కొత్తగూడెం అర్బన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగులకు ఉద్యోగులు కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఉద్యోగాల కల్పన చేస్తూనే.. విద్యాశాఖలో తొలగింపుల పర్వానికి తెరలేపింది. జిల్లాలో ఈ విద్యాసంవత్సరంలో ఈనెల 24 నుంచి ప్రభుత్వ విద్యాలయాలకు సెలవులు ప్రకటిస్తున్న తరుణంలో జిల్లాలో డీఎస్సీ-2008 ద్వారా న్యాయస్థానానికి వెళ్లి సుదీర్ఘపోరాటం చేసిన 41 మంది ఉపాధ్యాయులను కాంట్రాక్ట్ పద్ధతిలో ఫిబ్రవరి 14న విధుల్లోకి తీసుకున్నారు. ఒప్పంద పద్ధతిలో పనిచేస్తున్న టీచర్లను తొలగిస్తూ డీఈవో యం. వెంకటేశ్వరచారి ఏప్రిల్ 22న ఉత్తర్వులు జారీ చేశారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఏ కారణం లేకుండా తొలగించకూడదనే నిబంధనలు ఉన్నా.. ఉన్నతాధికారులు లెక్క చేయడం లేదు. వారందరిని నిబంధనల ప్రకారమే నోటిఫికేషన్ ఇచ్చి ఇంటర్వ్యూలో సర్టిఫికెట్లు పరిశీలన చేసి నియమించారు. విద్యాలయాల్లో బోధనకు అవసరాన్ని బట్టి ఈ నియామకాలు జరిపినట్లు కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు చెబుతున్నారు. కానీ సహేతుకమైన కారణం లేకుండానే అందరిని ఒకేసారి పక్కన పెట్టేయడంతో వారంతా తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికిప్పుడు ఉద్యోగం నుంచి తొలగిస్తే తమ కుటుంబాలు ఏం కావాలని వాపోతున్నారు. ఈ విషయమై



డీఈవో యం. వెంకటేశ్వరచారిని వివరణ కోరగా... డీఎస్సీ 2008 అర్హత సాధించిన వారిని జీవో నెం ఎంఎస్-9 ద్వారా కాంట్రాక్ట్ పద్ధతిన ఎంపికైన 41 మంది ఉపాధ్యాయుల అగ్రిమెంట్ ఈ నెల 23తో ముగుస్తున్నందున వారిని తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశామన్నారు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చిన తరువాత వారిని 2025-26 విద్యాసంవత్సరంలో మొదటిరోజున విధుల్లోకి కాంట్రాక్ట్ పద్ధతిన నియామకం చేస్తామన్నారు.

317 జీవో మ్యూచువల్ బదిలీల్లో 22 మంది రిలీవ్..

317 జీవో ద్వారా భద్రాద్రి జిల్లాకు కేటాయించి ఉపాధ్యాయుల్లో 22 మంది మ్యూచువల్ బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరి స్థానంలో కొత్తవారు జిల్లాకు కేటాయించడంతో పాఠశాలల్లో పనిచేస్తున్న 22 మందిని ఆఖరి పనిదినం రోజున 22న మంగళవారం రిలీవ్ ఉత్తర్వులను డీఈవో యం.వెంకటేశ్వరచారి జారీ చేశారు. వీరంతా 22న రిలీవ్ అవ్వడంతో వీరి స్థానంలో 23న బుధవారం కొత్తవారు జాయిన్ కానున్నారు.

317 జీవో స్పౌజ్ కేటగిరిలో 11మంది ఉపాధ్యాయుల రిలీవ్..

317 జీవో ద్వారా జిల్లాకు కేటాయించిన ఉపాధ్యాయుల్లో స్పౌజ్ కేటగిరిలో బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్న 11మంది ఉపాధ్యాయులను రిలీవ్ చేస్తూ డీఈవో వెంకటేశ్వరచారి ఏప్రిల్ 21న ఉత్తర్వులను జారీ చేశారు. జిల్లా నుంచి బదిలీపై వెళ్లిన వారిలో ఐదుగురు స్కూల్ అసిస్టెంట్లు, ఐదుగురు ఎస్జీటీలు, ఒక్కరు హిందీ పండిట్‌లు ఉన్నారు. ములుగు జిల్లాకు ఒక్కరు, ఖమ్మం జిల్లాకు 10 మంది ఉపాధ్యాయులను స్పౌజ్ కేటగిరిలో బదిలీ చేశారు.

బాధ్యతలు స్వీకరించిన న్యాయమూర్తులు



న్యాయమూర్తి సరితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

కొత్తగూడెం లీగల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు ఉత్తర్వుల మేరకు భద్రాద్రి జిల్లా మొదటి అదనపు జిల్లా జడ్జిగా ఎస్.సరిత పదవీ బాధ్యతలు చేపట్టారు. ప్రిన్సిపల్ జిల్లా అండ్ సెషన్స్ జడ్జి పాటిల్ వసంత్ నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటికే సికింద్రాబాద్ ఫ్యామిలీ కోర్టులో విధులు నిర్వహిస్తున్న ఆమె బదిలీపై కొత్తగూడెం చేరుకున్నారు. కే.కిరణ్‌కుమార్ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా సత్తుపల్లి సీనియర్ సివిల్ జడ్జి మీరా ఖాసీం నుంచి ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆయన హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో మొదటి అదనపు జడ్జిగా పని చేశారు. ఈ ఇద్దరు న్యాయమూర్తులు బుధవారం బాధ్యతలు స్వీకరించగా.. కొత్తగూడెం స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మెండు రాజమల్లు, కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బాగం మాధవరావు, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు మోహన్‌దాస్, కిరణ్‌కుమార్, జిల్లా న్యాయశాఖ అధ్యక్షుడు రామిశెట్టి రమేష్, నిమ్మల మల్లికార్జున్ శుభాకాంక్షలు తెలిపారు.

కొత్తచట్టంతో భూ రికార్డులు భద్రం

ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, కలెక్టర్ జితేష్ వి పాటిల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట్రావు

దుమ్ముగూడెం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నూతనంగా తెచ్చిన భూ భారతి ఆర్ ఓఆర్ చట్టంతో భూ రికార్డులు భద్రంగా ఉండడంతోపాటు భూ సమస్యలు సత్వరం పరిష్కారమవుతాయని ఎమ్మెల్యే డాక్టరు తెల్లం వెంకట్రావు, కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గంగోలు వీవీ ఫంక్షన్ హాలులో బుధవారం రైతులకు భూ భారతి చట్టంపై అవగాహన కల్పించారు.గత ప్రభుత్వం తెచ్చిన ధరణి చట్టం ప్రైవేటు సంస్థ నియంత్రణలో ఉంటే ప్రస్తుత భూ భారతి పూర్తిగా ప్రభుత్వ సంస్థ ఆధీనంలో పని చేస్తుందన్నారు. ధరణిలో 33 మాడ్యుల్స్‌కు బదులుగా కేవలం 6 మాడ్యుల్స్‌తో భూ భారతి చట్టం సులువైన విధానంలో పనిచేస్తుందన్నారు. కొత్తచట్టంలో అధికారుల జవాబుదారితనం, రికార్డు ఆధారంగా సవరణలు, గ్రామస్థాయిలో రికార్డుల నిర్వహణ ఉంటాయన్నారు. రెవెన్యూ అధికారులు గ్రామాల్లో సదస్సులు నిర్వహించి భూ సమస్యలు పరిష్కరిస్తారని తెలిపారు. కొత్త చట్టంతో గిరిజన, గిరిజనేతరులకు ఎటువంటి నష్టం ఉండదని, ఇప్పటికే భూ రికార్డుల్లో పేర్లు నమోదైన వాళ్లు ఎటువంటి దరఖాస్తులు చేయాల్సిన అవసరం ఉండదన్నారు. తొలుత నరసాపురం ఉన్నతపాఠశాలను సందర్శించారు. సైకిళ్లపై పాఠశాలకు వస్తున్న సమయంలో టైర్లకు పంచర్‌తో ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు కలెక్టర్‌కు తెలుపగా, పంచర్ కిట్లనందజేస్తామన్నారు.పాఠశాలలో తాగునీటి ఏర్పాటు చేయాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. పాఠశాలకు ఫీడింగ్ హాస్టల్‌ను కలెక్టర్ మంజూరు చేసినట్లు హెచ్ఎం బెక్కంటి శ్రీనివాసరావు తెలిపారు.ఏఎంసీ చైర్మన్ తెల్లం సీతమ్మ, పీఏసీఎస్ చైర్మన్ కిలిమి ఎల్లారెడ్డి, ఆర్డీవో దామోదర్‌రావు, తహసీల్దార్ అశోక్‌కుమార్, ఎంపీడీవో రామకృష్ణ, ఏడీ సుధాకర్, మాజీ జడ్పీటీసీ సత్యనారాయణమూర్తి, పాల్గొన్నారు.

కేటీపీఎస్ కాంప్లెక్స్‌లో
రెండు కొత్త ప్లాంట్లు నెలకొల్పాలి



మాట్లాడుతున్న రాసూరి చంద్రశేఖర్

పాల్వంచ టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కేటీపీఎస్ కాంప్లెక్స్‌లో ఇటీవల తొలగించిన పాత ప్లాంట్ స్థానంలో నూతనంగా మరో రెండు 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ప్లాంట్లను నిర్మించాలని అఖిల భారత ఎస్సీ, ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ సెంట్రల్ కమిటీ జనరల్ సెక్రెటరీ రాసూరి చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పాత ప్లాంట్ తొలగించడంతో ఉపాధి లేక స్థానిక యువత, ప్రజలు వలస బాటలు పట్టారని, దాంతో ఆ అంశం పట్టణ అభివృద్ధిపై పరోక్షంగా ప్రభావం చూపిందని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా ప్రభుత్వ సంస్థలైన ఏపీ స్టీల్స్, స్పాంజ్ ఐరన్, సింగరేణి, జెన్కో సంస్థలను ప్రైవేటు పరం చేయకుండా ప్రభుత్వమే అభివృద్ధి చేసి ఈ ప్రాంతంలో ఉన్న యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కాల్వ ప్రకాష్‌రావు, సెక్రటరీ కాల్వ భాస్కరరావు, నాయకులు ముళ్లపాటి రాజేంద్రకుమార్, కొత్తపల్లి సోమయ్య, మిరియాల వెంకటేశ్వర్లు, కొప్పుల వెంకన్న, గండూరి శ్రీను, నాగరాజు పాల్గొన్నారు.

అనుచరులకే ఇందిరమ్మ ఇళ్లు

- అధికార పార్టీలో వర్గ విభేదాలు
- సెంటు భూమి లేని వారికి కేటాయించని ఇందిరమ్మ ఇళ్లు

వేంసూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం పక్కదారి పడుతోంది. ఈ పథకం కింద వేంసూరు మండలానికి 575 ఇళ్లను కేటాయించారు. లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటుచేశారు. ఆ కమిటీలో అధికార పార్టీకి చెందిన అనుచరులకే ఇళ్లు కేటాయిస్తుండటంతో సెంటు భూమి లేని పేదల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. దీంతో గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలకు, అధికార నాయకుల మధ్య వర్గవిభేదాలు తలెత్తాయి. మొదటి విడతలో సెంటు భూమి లేని నిరుపేదలకు ప్రాధాన్యత ఇవాల్సి ఉన్నప్పటికీ వారికి కాకుండా అనుచరులకే ఇళ్లు కేటాయిస్తున్నారని పేదలు వాపోతున్నారు. కాగా వేంసూరుకు చెందిన తిప్పిశెట్టి త్రికవితకు సెంటు వ్యవసాయ భూమి కూడా లేదు. కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ పథకానికి అర్హురాలైనప్పటికీ ఇందిరమ్మ ఇల్లును కేటాయించలేదు. జిల్లాకు చెందిన మంత్రులైనా స్పందించి నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలని పేదలు ముక్తకంఠంతో కోరుతున్నారు.



బస్టాండ్ కిట కిట

సొంత ప్రాంతాలకు పయనమైన విద్యార్థులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండ్ విద్యార్థులు, ప్రయాణికులతో బుధవారం కిటకిటలాడింది. 2024-2025 విద్యా సంవత్సరానికిగాను వార్షిక ఫలితాలు సంబంధిత పాఠశాలల యాజమాన్యాలు ప్రకటించడంతో ఈ ఏడాది విద్యా సంవత్సరం ముగిసింది. వివిధ ప్రైవేటు పాఠశాలల్లో, రెసిడెన్షియల్‌లో చదువుతున్న విద్యార్థులు ఇంటిబాట పట్టారు. దీంతో బస్టాండ్లు విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కిక్కిరిశాయి. గురువారం నుంచి జూన్ 11వ తేదీ వరకు వేసవి సెలవులను ప్రభుత్వం ప్రకటించింది.

25న 5వ తరగతి ప్రవేశాలకు
మైనారిటీ స్కూల్‌లో లక్కీడ్రా

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి పట్టణంలోని తెలంగాణ మైనారిట పాఠశాలలో 5వ తరగతిలో నాన్ మైనారిటీ విభాగంలో ప్రవేశాలకు ఉదయం 11 గంటలకు లక్కీడ్రా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కే.వెంకటరామయ్య బుధవారం తెలిపారు. బీసీ (10), ఎస్సీ (5), ఎస్టీ (3), ఓసీ (2) విద్యార్థుల చొప్పున 20 సీట్లకు అవకాశం ఉందని, తల్లిదండ్రులు, విద్యార్థులు సంబంధిత ధ్రువపత్రాలతో సకాలంలో హాజరుకావాలని కోరారు. అనంతరం ఇంటర్ ఫలితాలలో ఉత్తమ ర్యాంకులు సాధించిన డీ.మహేంద్ర, టీ.మణికంఠ, హరినాథ్, ఎండీ.జావీద్, కే.పవన్‌కుమార్, కే.దుర్గామహేష్, ఎస్‌కే.కమల్‌సాహేబ్, కే.చందులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

పహల్గాం నరమేధంపై నిరసన

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో 26 మంది పర్యాటకులను ఉగ్రవాదులు కాల్చిచంపిన ఘటన అత్యంత అమానుషమని ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ ఖండించారు. ఈ ఘటనను నిరసిస్తూ బుధవారం ఖమ్మంలో 40, 41 డివిజన్లకు చెందిన కాంగ్రెస్ శ్రేణులు నిరసన ప్రదర్శనలు చేపట్టారు. జడ్పీసెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ నీరజ, ఏఎంసీ చైర్మన్ యర్రగర్ల హనుమంతరావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ మాట్లాడారు. దేశ ప్రజలకు రక్షణ కల్పించటంలో కేంద్ర హోంశాఖ విఫలం చెందిందని ఆరోపించారు. తక్షణమే సంఘటనకు కారణమైన ఉగ్రవాదులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌కు సరైన గుణపాఠం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. నాయకులు మిక్కిలినేని నరేంద్ర, ఎస్‌కే ఖాదర్, చామకూరి వెంకన్న, పాలకుర్తి నాగేశ్వరరావు, ఆల్‌షాద్, అబ్దుల్, అహద్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో...

జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్ర దాడి ఘటన అత్యంత హేయమని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తంచేశారు. బుధవారం సీపీఎం కార్యాలయం నుంచి గట్టయ్య సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. నాయకులు వై విక్రమ్, ఎంఏ జబ్బార్, దొంగల తిరుపతిరావు, మీరాసాహెబ్, బండారు రమేశ్, మనోహర్, మెరుగు సత్యనారాయణ, భూక్యా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో...

జమ్మూకశ్మీర్ ఘటనను ఖండిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో ఎన్ఎస్‌టీ రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మహ్మద్ సలామ్, నాయకులు యానాలి సాంబశివరెడ్డి, జ్వాలా నర్సింహారావు, చాన, రహమాన్, రమణ, మజీద్, ఖాసీంపాషా, శ్రీదేవి, పిచ్చయ్య, అక్బర్, జహార్ పాల్గొన్నారు.

కొత్తగూడెంలో...

లక్ష్మీదేవిపల్లి (ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్ ఘటనను తీవ్రంగా ఖండిస్తూ బుధవారం రాత్రి కొత్తగూడెంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. దాడులకు తెగపడిన ఉగ్రవాదులను శిక్షించాలంటూ నినదించారు. ఖబర్దార్ టెర్రరిస్టులారా అంటూ హెచ్చరించారు. ప్రశాంతంగా ఉన్న దేశంలో చిచ్చుపెట్టేందుకు ప్రయత్నం చేస్తున్న ఉగ్రవాదులను మట్టుపెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉగ్రవాది దాడిలో మృతిచెందిన కుటుంబాలకు నివాళులర్పించారు. కొత్తగూడెంలోని గణేష్‌టెంపుల్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ సూపర్‌బజార్ మీదుగా బస్టాండ్, పోస్టాఫీస్ సెంటరులోని అమరవీరుల స్థూపం వరకు సాగింది. ఈ ర్యాలీలో పార్టీలకతీతంగా నాయకులు, హిందుత్వ వాదులు, ప్రజలు పాల్గొన్నారు.

రచ్చకెక్కిన కాంగ్రెస్ వర్గ పోరు

(5వ పేజీ తరువాయి)

రంగంలోకి దిగడంతో పాలకమండలి నియామక ఉత్తర్వులను గతనెల 26న దేవాదాయ శాఖ రద్దు చేసింది. భట్టి, పొంగులేటి వర్గీయుల మధ్య వర్గపోరు జరుగుతున్న నేపథ్యంలో పెద్దమ్మతల్లి పాలకమండలిలో స్థానికులకు అవకాశం కల్పించాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. ఇదే అదనుగా భట్టి వర్గీయులు స్థానిక డిమాండ్‌ను బలపరుస్తూ తెరవెనుక రాజకీయానికి శ్రీకారం చుట్టారు. అయితే పొంగులేటి వర్గానికి ప్రాధాన్యం ఇస్తూ గత నెల 30న దేవాదాయశాఖ పాలక మండలిని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో పొంగులేటి వర్గీయులు ప్రమాణ స్వీకారం చేసేందుకు సర్వం సిద్ధం చేసుకోగా.. స్థానికులతో పాటు భట్టి వర్గీయులు అడ్డుకున్నారు. ఆత్మహత్యాయత్నానికి సైతం వెనుకాడలేదు. దీంతో ప్రమాణ స్వీకారం వాయిదాపడింది.

ఇదిలాఉండగా, పొంగులేటి వర్గీయులు పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవాన్ని మంగళవారం రెండోసారి ఏర్పాటు చేయగా, పలువురు స్థానికులతో పాటు భట్టి వర్గీయులు అడ్డుకునేందుకు యత్నించారు. ఇద్దరు యువకులు కిరోసిన్ పోసుకుని హల్‌చల్ చేశారు. మహిళలు ఆలయం ముందు కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. దీంతో పెద్దసంఖ్యలో పోలీసులు అక్కడికి చేరుకుని స్థానికులతో పాటు భట్టి వర్గీయులను పక్కకు పంపించడంతో ప్రమాణ స్వీకారం సాఫీగా సాగింది. చైర్మన్‌గా బాలినేని నాగేశ్వరరావు, సభ్యులుగా భూక్యా గిరిప్రసాద్, కోరం స్వర్ణలత, రామయ్య, ఎస్.రమ్య, ధర్మరాజుల నాగేశ్వరరావు, చీకటి కార్తీక్, సీహెచ్.పాపారావు, చెరుకూరి శేఖర్‌బాబు, దుగ్గిరాల సుధాకర్, ఎస్.శ్రీనివాసరావు, ఎ.సాయిబాబాతో అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు.

కొత్తగూడెం నియోజకవర్గంలోని పెద్దమ్మతల్లి పాలక మండలి నియామకంలో రాజకీయ వర్గ పోరును కాంగ్రెస్ పార్టీ నాయకులు సమన్వయం చేయలేకపోయారనే విమర్శలు తలెత్తాయి. ఇరువర్గాల నడుమ వివాదాన్ని సర్దుబాటు చేయలేక వదిలి వేశారని చర్చ సాగుతోంది. అధికారపార్టీలోని ప్రజాప్రతినిధులు సైతం వర్గపోరుతో తలలు పట్టుకుంటున్నారు. నియోజకవర్గంలో నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ అధిష్టానానికి తలనొప్పిగా మారిందని కాంగ్రెస్ నాయకులు బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

ఇదిలాఉండగా, పెద్దమ్మతల్లి ఆలయం కాసులు రాల్చే కల్పవల్లిగా మారడం వల్లే పాలకమండలికి పోటీ పెరిగిందనే అభిప్రాయాలు వున్నాయి. అనేక రకాలుగా ఆదాయమార్గాలు ఏర్పాటు చేసుకునే అవకాశాలు ఉండటం వల్లే పాలకమండలిలో పదవులు దక్కించుకునేందుకు పోటాపోటీగా వ్యవహరించారనే అభిప్రాయాలు వున్నాయి. అధికార పార్టీలోని రెండు పవర్ సెంటర్‌ల మధ్య ఆధిపత్య పోరు జరగగా, స్థానికంగా ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు (సీపీఐ) ఈ విషయంలో జోక్యం చేసుకోకపోవడం విశేషం.

రెండు బార్లకు పది దరఖాస్తులు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో మూతపడిన రెండు బార్లుకు రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ అధికారులు ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేశారు. కాగా మంగళవారం వరకు ఒక్క దరఖాస్తులు రాలేదు. బుధవారం మాత్రం రెండు బార్లుకు కలిపి కేవలం 10 దరఖాస్తులు మాత్రమే అందాయి. ఈనెల 26తో దరఖాస్తులు తుది గడువు ముగుస్తోంది. 29న డ్రా ద్వారా ఎంపిక జరుగనుంది. అయితే గతంలో ఇదే బార్లు నిర్వహించిన నిర్వాహకులు తిరిగి తమకే బార్లు కేటాయించాలని నోటిఫికేషన్ విడుదలైన తర్వాత కోర్టును ఆశ్రయించారు. దీంతో రెండు బార్ల దరఖాస్తులపై ప్రభావం పడింది. కోర్టు తీర్పు ఎలా వస్తుందో అనే సందేహంతో దరఖాస్తులు అందించేందుకు ముందుకు రావటం లేదు.

పుస్తక పఠనంతో బహుళ ప్రయోజనాలు

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): నిత్య పుస్తక పఠనం ద్వారా అనేక రకాల ప్రయోజనాలు ఉంటాయని, ఒక మంచి పుస్తకం విద్యార్థి జీవితాన్నే మారుస్తుందని గిరిజన మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ స్పందన అన్నారు. మండలంలోని పెదవాగుప్రాజెక్టులో గల గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం పుస్తక దినోత్సవం, ప్రపంచ ఆంగ్ల బాష దినోత్సవం, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ధరిత్రి దినోత్సవాలను ఘనంగా జరిపారు. ప్రిన్సిపాల్ స్పందన మాట్లాడుతూ నిత్య పుస్తక పఠనం అలవాటు కావటం ద్వారా అనేక విషయాలు తెలుస్తాయన్నారు.కార్యక్రమంలో అధ్యాపకులు అరుణ, భవాని, స్వర్ణ, హైమావతితో పాటు పలువురు పాల్గొన్నారు.

ముందుకు సాగని
ధాన్యం కొనుగోళ్లు

(5వ పేజీ తరువాయి)

తలెత్తింది. ఈ మూడు మిల్లుల వారు తమకున్న డిమాండ్‌ను ఆసరా చేసుకొని రైతుల నుంచి ధాన్యం దిగుమతి చేసుకొనేందుకు భారీగా తరుగు తీసేందుకు డిమాండ్ చేస్తున్నారు.

ఖమ్మానికి చెందిన ముదిగొండ మండలంలోని ఒక పార్‌బాయిల్డ్ మిల్లు యజమాని అయితేక్వింటాకు పదికిలోల ధాన్యాన్ని తరుగు కింద డిమాండ్ చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. తమ మిల్లుకు వచ్చిన లారీల్లోని ధాన్యాన్ని పేచీలు పెడుతూ దిగుమతి చేసుకోకుండా ఆలస్యం చేస్తుండటంతో వైరా మండలంలోని పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనప్పటికీ కొనుగోళ్లు మాత్రం జరగటం లేదు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురంలో మూడురోజుల కిందట ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ డీసీఎంఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఇంతవరకు ఇక్కడ గింజ ధాన్యాన్ని కూడా కాంటా వేయలేదు.

సిరిపురంలోని డీసీఎంఎస్ కొనుగోలు కేంద్రంలో కూడా ధాన్యం కొనుగోలు చేయడం లేదు. తాటిపూడి, గొల్లపూడి, ముసలిమడుగు, గన్నవరం, పూసలపాడు కేంద్రాల్లో సైతం కొనుగోళ్లు జరగటం లేదు. మిల్లుల కేటాయింపు జరగలేదని అందువల్ల ధాన్యాన్ని కొనుగోలు చేయలేకపోతున్నామని ఆ ఏజెన్సీల వారు రైతులకు చెపుతున్నారు. దాంతో ఓ వైపున వాతావరణం ఎప్పుడెలా ఉంటుందో తెలియక, రోడ్లు, కల్లాలపై ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ మండలానికే చెందిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అయినా చొరవ తీసుకొని సకాలంలో ధాన్యాన్ని కొనుగోలు చేయించాలని రైతులు కోరుతున్నారు.

ధంసలాపురం అండర్ బ్రిడ్జిని పూర్తి చేయండి

- దక్షిణ మధ్య రైల్వే జీఎంకు ఎంపీ రఘురాంరెడ్డి వినతి



రైల్వేజీఎంతో మాట్లాడుతున్న ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మం మామిళ్లగూడెం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే జీఎంను ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రఘురాంరెడ్డి బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఖమ్మం నగరానికి సమీపంలోని ధంసలాపురం దగ్గర గేట్ నెంబర్ 106 అండర్ బ్రిడ్జి నిర్మాణం గత కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉందని, ఫలితంగా స్థానిక రైతులు పరిసర గ్రామ ప్రజలు ఇబ్బంది పడుతున్నట్టు వివరించారు. త్వరితగతిన అండర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. స్పందించిన రైల్వే జనరల్ మేనేజర్ సంబంధిత చీఫ్ ఇంజనీర్‌తో మాట్లాడి వెంటనే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. డోర్నకల్ - మిర్యాలగూడెం, డోర్నకల్-గద్వాల రైల్వేలైన్ అలైన్‌మెంట్ మార్పి డోర్నకల్ - వెన్నారం, మరిపెడ, మోతే ద్వారా వెళ్లడానికి గతంలో ప్రతిపాదించిన పనులపై జీఎంతో చర్చించారు. గతం లో రద్దు చేసిన రైళ్లను తిరిగి పునరుద్ధరించాలని ఖమ్మం, బోనకల్, ఎర్రుపాలెం, డోర్నకల్ నుంచి భద్రాచలం రోడ్డు వెళ్లే మార్గంలో గాంధీనగర్‌స్టేషన్‌లో రైళ్లను నిలుపుదల చేయాలని ఎంపీ రఘురాంరెడ్డి జీఎంకు విజ్ఞప్తి చేశారు.

ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు



రాజారంలో కాంగ్రెస్ కార్యకర్తను పరామర్శిస్తున్న మంత్రి

(5వ పేజీ తరువాయి)

భూ భారతి చట్టం గ్రామాల్లో అపరిష్కృతంగా ఉన్న భూవివాదాల శాశ్వత పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టం తెచ్చిందని, హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు ఈ చట్టం రైతులకు ఒక వరంలాంటిదన్నారు. ఈ చట్టం అమలుకు పైలెట్ ప్రాజెక్టు కింద రాష్ట్రంలో నేలకొండపల్లి మండలాన్ని ఎంపిక చేశామన్నారు.

ఈ కార్యక్రమంలో ఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఉన్నం బ్రహ్మయ్య, రామసహాయం నరేష్‌రెడ్డి చావా శివరామకృష్ణ, రాష్ట్ర మహిళ మాజీ కార్పొరేషన్ చైర్మన్ మద్దినేని బేబీ స్వర్ణకుమారి, బెల్లం శ్రీను, మంగిలాల్, పీఆర్ ఈఈ వెంకటరెడ్డి జేడీఏ పుల్లయ్య, ఏడీఏ సరిత, ఏవోసీతారాంరెడ్డి, తహసీల్దార్ సుధీర్, ఎంపీడీవో సిలార్‌సాహెబ్ పాల్గొన్నారు.

కాగా, మండలంలోని హస్నాబాద్‌లో ఇస్లావత్ తండాకు చెందిన ఇస్లావత్ మంజ్యా, నీల దంపతులు మంత్రి పర్యటనలో హల్‌చల్ చేశారు. ఇదే గ్రామానికి చెందిన నగేష్ కుటుంబసభ్యులు తననే వేధిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదని ఆరోపిస్తూ హల్‌చల్ చేశారు.

నిర్లక్ష్యం వహిస్తే మిల్లులను సీజ్ చేస్తాం

» సివిల్ సప్లయీస్ డీఎం శ్రీలత



ధాన్యం కేంద్రాన్ని పరిశీలిస్తున్న శ్రీలత

కల్లూరు, ఏప్రిల్23 (ఆంధ్రజ్యోతి): రైతు ల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని సకాలంలో దిగుమతి చేసుకోకపోతే సదరు మిల్లులను సీజ్ చేస్తామని సివిల్ సప్లయి డీఎం శ్రీలత, ఆర్డీవో ఎల్ రాజేంద్రగౌడ్‌లు హెచ్చరించారు. మండల పరిధిలోని పుల్లయ్యబంజర ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వా రు బుధవారం పరిశీలించారు. ధాన్యం దిగుమతిలో ప్రభుత్వ నిబంధనలను తప్పని సరిగ్గా పాటించాలని మిల్లుల యాజమానులను ఆదేశించారు. దిగుమతిలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. మిల్లుల్లో రికార్డులతో పాటుగా పరిసరాలు, లారీల ఎగుమతులు, దిగుమతులు వివరాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పిసాంబశివుడు పాల్గొన్నారు.

సీతారామ జలాలను భద్రాద్రి జిల్లా రైతులకే అందించాలి



మాట్లాడుతున్న కొండపల్లి శ్రీధర్

జూలూరుపాడు, ఏప్రిల్23(ఆంధ్రజ్యోతి): సీతారామ ప్రాజెక్ట్ ద్వారా గోదావరి జలాలను భద్రాద్రి జిల్లా రైతులకే అందించాలని సీపీఎం జిల్లా నాయకుడు కొండపల్లి శ్రీధర్ అన్నారు. బుధవారం మండలంలోని పలు ం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ సీతారామ జలాలను భద్రాద్రి జిల్లాకే వినియోగించాలని కోరుతూ ఈ నెల 25న కొత్తగూడెం క్లబ్‌లో జిల్లా స్థాయి సదస్సును నిర్వహిస్తున్నామని, ఈ సదస్సులో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సాగర్ ఆయకట్టు స్థిరీకరణ పేరుతో గోదావరి జలాలను భద్రాద్రి జిల్లా నుంచి ఇతర జిల్లాలకు తరలించే ప్రయత్నం రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందని ఆరోపించారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి యాసా నరేష్, నాయకులు పద్దం సుగుణ, నర్సింహారావు, ఇందిరా, సరిత, చంద్రయ్య, ఈసం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రికి అనస్తీషియా వర్క్ స్టేషన్లు

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ థియేటర్లలో రోగికి ఆపరేషన్ చేసే సమయంలో వినియోగించే అనస్తీషియా వర్క్‌స్టేషన్‌ను బుధవారం సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్. కిరణ్‌కుమార్ ప్రారంభించారు. జిల్లా జనరల్ ఆస్పత్రికి మూడు వర్క్‌స్టేషన్లను సర్కారు విడుదల చేసింది. సుమారు రూ.15లక్షల విలువైన ఈ పరికరాలను ఎంసీహెచ్‌కు ఒకటి, జనరల్ ఆపరేషన్ థియేటర్‌లో రెండు వినియోగించనున్నారు. రోగికి ఆపరేషన్ చేసే సమయంలో మత్తు ఇచ్చేందుకు దీనితో పాటు ఆక్సిజన్‌ను అందించేలా ఈ పరికరాన్ని వినియోగిస్తారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో బోల్తా..మహిళ మృతి

నేలకొండపల్లి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శంకరగిరి తండా వద్ద ఆటో బోల్తా పడిన సంఘటనలో ఓమహిళ మృతి చెందింది. వివరాల ప్రకారం శంకరగిరితండాకు చెందిన బాణోతు ఉపేందర్ కూలీలను తీసుకుని ముదిగొండ మండలం మాధాపురం వెళ్లి, తీసుకుని వస్తుంటాడు. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం మాదాపురం నుంచి ఐదుగురు కూలీలను తీసుకుని శంకరగిరితండా వస్తుండగా, శంకరగిరితండా సమీపంలో ఆటో బోల్తా పడింది. ఆటో బోల్తా పడటంతో ఆటోలోనే ఉన్న బాణోతు మాధవి(27) తీవ్రంగా గాయపడింది. తీవ్రంగా గాయపడిన మాధవిని నేలకొండపల్లి సీహెచ్‌సీకి తరలించి ప్రాధమిక చికిత్స చేసిన అనంతరం మెరుగైన చికిత్స కోసం ఖమ్మం తరలించారు. ఖమ్మంలో చికిత్స పొందుతూ మాధవి మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇరువురు కుమారులున్నారు. కాగా మృతురాలి భర్త ఉపేందర్ ఆటో డ్రైవర్. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నేలకొండపల్లి సీహెచ్‌సీకి తరలించారు. నేలకొండపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో విశ్రాంత ఉద్యోగి గల్లంతు

తల్లాడ, ఏప్రిల్23(ఆంధ్రజ్యోతి): చెరువులోకి దిగిన దూడను కాపాడబోయి విశ్రాంత ఉద్యోగి గల్లంతైన సంఘటన బుధవారం తల్లాడ మండలం ముద్దునూరు గ్రామంలో చోటుచేసుకుంది. ముద్దునూరు గ్రామానికి చెందిన రిటైర్డు సింగరేణి ఉద్యోగి కాకర్ల అప్పారావు(63) గల్లంతయ్యాడు. గ్రామసమీపంలోని చెరువులో గేదెదూడ దిగి నీటి ప్రవహానికి కొట్టుకుపోతుండడంతో దాని కాపాడే ప్రయత్నంలో అప్పారావు చెరువులోకి దిగి గల్లంతయ్యాడు. సమాచారం తెలుసకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరారు. అప్పారావు ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

పంట పొలాల్లో వ్యర్థాలకు నిప్పు

కొణిజర్ల, ఏప్రిల్23(ఆంధ్రజ్యోతి): రైతులు పంట పొలాల్లో వ్యర్థాలకు నిప్పు పెట్టడం వలన గాలిదుమారానికి ఆ మంటలు కాస్త విరజిమ్ముతూ వస్తూ ఇతర రైతుల పంటపొలాలపై, ప్రభుత్వ కార్యాలయాల వైపు మంటలు వస్తున్నాయి. బుధవారం మండల పరిధిలోని పెద్దగోపతి సమీపంలో రైతులు పొలాల్లో వ్యర్థాలకు నిప్పు పెట్టడడం వలన అవి కాస్త మండుకుంటూ గ్రామ సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌కు దగ్గరకు వచ్చింది. అప్రమత్తమైన ఇతర రైతులు ఫైర్ సిబ్బందికి ఫోన్ చేయడంతో రెండు ఫైర్ ఇంజన్‌లు వచ్చి మంటలను అదుపు చేశాయి. మంటలు అలాగే వస్తే సబ్‌స్టేషన్ వరకు వచ్చేవని గ్రామస్థులు, సిబ్బంది చెప్పుకుంటున్నారు. వ్యర్థాలను కాల్చే సమయంలో కనీస నిబంధనలు పాటించటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సీపీఐ సీనియర్ నాయకుడి మృతి



నివాళులర్పిస్తున్న బాగం హేమంతరావు

పాల్వంచటౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సీపీఐ సీనియర్ నాయకుడు, ఉమ్మడి జిల్లా కార్యవర్గ సభ్యుడు, ఖమ్మానికి చెందిన వెంపటి సూర్యనారాయణ(85) అనారోగ్యంతో పాల్వంచలోని తన కుమార్తె నివాసంలో బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా ఆయన మృతదేహాన్ని సందర్శించి మృతదేహంపై ఎర్రజెండా కప్పి, పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. నాయకులు ముత్యాల విశ్వనాథం, అడుసుమల్లి సాయిబాబు, రాహుల్, నరసింహారావు, బాబు, వెంకటేశ్వర్లు, వెంకట్రావు, రాంబాబు, శ్రీనివాసరావు, గిరి, సత్యనారాయణ, ఆదినారాయణ, అజయ్, హరి తదితరులు పాల్గొన్నారు.

భూ భారతితో సమస్యల పరిష్కారం

» కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

మధిరటౌన్, ఏప్రిల్23(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసమే భూ భారతి చట్టం తీసుకువచ్చినట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం మధిరలోని రిక్రియేషన్ క్లబ్ కల్యాణమండపం లో జరిగిన భూ భారతి అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతు 1930 సంవత్సరం తరువాత సమగ్ర భూ సర్వే జరగలేదని భూమికి సంబంధించిన సమస్యలు కొన్ని అనేక ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్నాయని భూ యజమానులు, రైతులు సంతోషంగా ఉండాలనే ప్రభుత్వం భూ భారతి కొత్త ఆర్ఓఆర్ చట్టంతో శాశ్వత పరిష్కారం లభించేలా చట్టాన్ని రూపొందించిందని అన్నారు. భూములకు సంబంధించిన సమాచారం జిపిఎస్ ప్రక్రియ తో మరోకసారి సర్వే చేపట్టి సరిహద్దులు ఏర్పాటు భూ యాజమాన్యాన్ని నిర్ధారించడం జరుగుతుందని ఈ సర్వే చేసిన తరువాత కొలతల్లో ఇంచి కూడ తేడా ఉండదని అన్నారు. జిల్లాలో 52 వేల సాదా బైనామా దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని రైతులు తమ భూమికి సంబందించిన సమస్యల పరిష్కారం కోసం వస్తే రైతు వాదనలో న్యాయం ఉన్న కొన్నింటిని జిల్లా కలెక్టర్ అయిన తాను కూడ పరిష్కారం చేయలేని విదంగా ధరణి లో ఉందని అన్నారు. బవిష్యత్తులో ఇటు వంటి వాటి పరిష్కారం కోసం తహసీల్దార్ స్థాయిలో తహసీల్దార్, ఆర్డీఓ స్థాయిలో ఆర్డీఓ, కలెక్టర్ స్థాయిలో కలెక్టర్ పరిష్కరించేలా కోర్టులు రానున్నాయని అన్నారు. ఈ సందర్బంగా రైతులు అడిగిన పలు సందేహాలను ఆర్డీఓ నరసింహారావు కొత్త చట్టం ద్వారా ఎలా పరిష్కారం లబించనుందో వివరించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీఓ నరసింహారావు, అదనపు డిఆర్డీఓ నూరుద్దీన్, తహసీల్దార్ రాంబాబు, మునిసిపల్ కమిషనర్ సంపత్ కుమార్ అధికారులు, ప్రజాప్రతినిదులు, రైతులు, రైతు సంఘనాయకులు పాల్గొన్నారు.

ఇందిరా డెయిరీతో మహిళలు అభివృద్ధి

మధిరరూరల్, ఏప్రిల్23(ఆంధ్రజ్యోతి): ఇందిరా డెయిరీ ద్వారా మహిళ సంఘ సభ్యులు అభివృద్ధి చెందాలని అడిషనల్ డీఆర్డీవో నూరుద్దీన్ అన్నారు బుధవారం మధిర మండలం దెందుకూరు గ్రామంలో స్వయం సంఘాల మహిళలకు మహిళ డైరీ పాడిగేదెలపై అవగహన సదస్సు నిర్వహించారు. ఈసందర్బంగా ఆయన మట్లాడుతూ ఇందిరా మహిళా డైయిరీ పథకంలో సభ్యత్వ వాటాధనం చెల్లించిన సభ్యులందరికీ సబ్సిడీ ద్వారా పాడిగేదెలు ఇప్పించి తద్వారా పాలను అమ్ముకుని వారి కుటుంబాలు అభివృద్ధి చెందాలని లక్ష్యంతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రత్యేక దృష్టిసారించడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో ఏపీఎం జంగం లక్ష్మణరావు, ఏపీఎం మామిళ్ల శ్రీనివాసరావు, కంటిపుడి అన్నపూర్ణ తదితరులున్నారు.

మే 22 నుంచి అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు

ఖమ్మం ఖానాపురంహవేలి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు మే 22 నుంచి నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కె. రవిబాబు తెలిపారు. ఈ నెల 23 నుంచి 29 వరకు పరీక్ష ఫీజు చెల్లించాలని తెలిపారు. మే3 నుంచి 6 వరకు ప్రాక్టికల్ పరీక్షలు, మే9న ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు, మే10న ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఆంగ్ల ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రీ వెరిఫికేషన్‌కు ప్రతి పేపర్‌కు రూ.600లు చొప్పున, రీ కౌంటింగ్‌కు ప్రతి పేపర్‌కు రూ.100ల చొప్పున ఈ నెల 23 నుంచి 30 లోగా ఆన్‌లైన్‌లో ఫీజు కట్టి దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

సింగరేణి జనరల్ మజ్దూర్లు ఇక జనరల్ అసిస్టెంట్లు

» కార్మికుల హోదాను మారుస్తూ సింగరేణి ఉత్తర్వులు



కొత్తగూడెం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో క్యాటగిరి-1లో పని చేస్తున్న జనరల్ మజ్దూర్లను ఇకపై ఆ పేరుతో కాకుం డా జనరల్ అసిస్టెంట్‌గా నామకరణం చేస్తూ సింగరేణి యాజమా న్యం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల జరిగిన జాతీయస్థాయి వేజ్‌బోర్డు ఒప్పందంలో ఈ పేరు మార్పునకు సంబంధించి తీసుకున్న నిర్ణయాన్ని సింగరేణి సంస్థ ఛైర్మన్, ఎండి ఎన్. బలరాం తక్షణమే అమలు జరపాలని ఆదేశించడంతో ఈ మేరకు సర్క్యులర్ జారీ చేయడం జరిగింది. దీంతో జనరల్ మజ్దూర్ అనే పేరు ఇకపై కనుమరుగు కానుంది. దీనిపై సింగరేణిలోని 14వేల మంది జనరల్ మజ్దూర్లతోపాటు కార్మికులు, కార్మిక సంఘాల నా యకులు హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు సింగరేణి సంస్థలో క్యాటగిరి-1లో పని చేసే వారిని జనరల్ మజ్దూర్ అని పిలవడం అలవాటుగా వస్తోంది. మజ్దూర్ అంటే హిందీలో కార్మికుడు. కూలీ అని అర్థం. సింగరేణి సంస్థలోనే కాక కోల్ ఇండియాలో కూడా ఈ కిందిస్థాయి ఉద్యోగులను ఇదే పేరుతో పిలుస్తూ వస్తున్నారు. బొగ్గు తవ్వకం తొలిరోజుల్లో గుత్తేదారులే యజమానులుగా ఉంటుండేవారు. బొగ్గు తవ్వడం కోసం పల్లె ప్రాంతం నుంచి కూలీలను (మ జ్దూర్)లను తీసుకుని వస్తుండేవారు. కాలక్రమంలో బొగ్గు గనులు జాతీయకరణ జరిగిన తర్వాత ఈ మజ్దూర్‌లను అన్ని రకాల శారీరక శ్రమకు సంబంధించిన పనులకు వినియోగిస్తుండేవారు. వీరిని జనరల్ మజ్దూర్లుగా గుర్తించడం చేశారు. గతంలో కేవలం నిరాక్షరాస్యులు మాత్రమే జనరల్ మజ్దూర్లుగా పని చేస్తుండేవారు. కానీ నేడు కారుణ్య నియామకాల్లో ఉన్నత చదువులు చదివిన వారు కూడ తొలుత బదిలీ వర్కర్లుగా ఎంపికై, ఏడాది తర్వాత జనరల్ మజ్దూర్లుగా గుర్తించబడుతున్నారు. బొగ్గు ఉత్పత్తి ప్రక్రియలో జనరల్ మజ్దూర్లు కూడా కీలకంగా ఉంటుండం వల్ల వీరి వృత్తికి కూడా సముచిత గౌరవం ఇవ్వాలన్న ఉద్దేశంతో జనరల్ మజ్దూర్ అనే పేరును తొలగించి జనరల్ అసిస్టెంట్‌గా మార్పు చేశారు. ఈ మార్పును వెంటనే అమలు జరిపిన సంస్థ ఛైర్మన్ ఎన్. బలరాంనికి కార్మికులు, కార్మిక సంఘాలు తమ కృతజ్ఞతలు తెలిపారు.

సింగరేణి మహిళా కళాశాల స్వర్ణోత్సవ లోగో ఆవిష్కరణ



మాట్లాడుతున్న సింగరేణి సీఎండీ బలరాం

కొత్తగూడెం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ కొత్తగూడెంలో తొలి మహిళా కళాశాలను ప్రారంభించి ఈ ఏడాదిలో 50 ఏళ్ల పూర్తి కావస్తున్న సందర్భంగా సింగరేణి ఎడ్యూకేషన్ సొసైటీ రూపొందించిన గోల్డెన్‌జూబ్లీ లోగోను సింగరేణి సీఎండీ ఎన్. బలరాం బుధవారం హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా ఆవిష్కరించారు. మహిళ విద్యకు అంకితమై ఐదు దశాబ్ధాలుగా సేవలు అందిస్తున్న ఈ కళాశాల మరింతగా వృద్ధి చెందాలని, రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ కళాశాలగా ఎదగాలని ఆయన శుభాకాంక్షలు తెలిపారు. 1975లో సింగరేణి సంస్థ మహిళా విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ కొత్తగూడెంలో సింగరేణి మహిళా కళాశాలను ప్రారంభించిందన్నారు. అంచెలంచెలుగా ఎదుగుతూ డిగ్రీ కళాశాలగా పీజీ కళాశాలగా కూడా ఎదిగింది. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్‌వి. సూర్యనారాయణ, డైరెక్టర్ (పీపీ,పా) కే. వెంకటేశ్వర్లు, సీపీపీ ఎ.మనోహర్, కొత్తగూడెం సింగరేణి సింగరేణి విద్యాసంస్థల కార్యదర్శి గుండా శ్రీనివాస్ పాల్గొన్నారు.

పనిచేయకుంటే వెళ్లిపోండి

» వైరా మునిసిపాలిటీలోని పరిస్థితులపై ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ఆగ్రహం



సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఇక్కడ ఉండాలంటే చిత్తశుద్ధితో పనులు చేయాలి... పనిచేయటం ఇష్టం లేకుంటే వెంటనే ఇక్కడి నుంచి వెళ్లిపోండి అని వైరా మునిసిపల్ కమిషనర్ చింతా వేణు, పలువురు అధికారులకు ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ స్పష్టం చేశారు. వైరా మునిసిపాలిటీలోని అస్తవ్యస్త, అడ్డగోలు పనితీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. మునిసిపాలిటీ అధికారులు, సిబ్బందిపై నిత్యం తీవ్ర ఆరోపణలు, విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో మంగళవారం రాత్రి తమ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. స్థానికుడైన మాజీ సర్పంచ్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ ఛైర్మన్ బొర్రా రాజశేఖర్ సహా పలువురు నాయకులు కూడా సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. మునిసిపాలిటీలో ఎవరైనా ఇళ్లనిర్మాణం ప్రారంభించిన వెంటనే అనుమతుల గురించి పట్టించుకోకుండా వదిలేస్తూ కొంతమేర నిర్మాణం జరిగిన తర్వాత అనుమతులేవంటూ వాటిని కూల్చివేస్తామని బెదిరించి వారి నుంచి డబ్బులు తీసుకుంటున్నారనే ఆరోపణలపై కమిషనర్, అధికారులను నిలదీయగా నీళ్లు నమిలినట్లు సమాచారం. ఎవరైనా ఇంటి నిర్మాణం చేపట్టిన వెంటనే మునిసిపల్ అధికారులు అక్కడకు వెళ్లి సరైన అనుమతులు ఉన్నాయా లేవా అని పరిశీలించి, ఒకవేళ లేకుంటే అవసరమైన అనుమతులు ఎలా తీసుకోవాలో వారికి వివరించి వాటిని ఇప్పించాలే తప్ప నిర్మాణం మధ్యలో బెదిరించి అవినీతికి పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. మునిసిపాలిటీలోని ఒకరిద్దరు సిబ్బంది అంతా తామే అయి పెత్తనం చెలాయించటంపై కూడా ప్రస్తావనకు వచ్చింది. పని చేస్తే ఉండండి...లేకుంటే ఇక్కడి నుంచి వెళ్లిపోండి తప్ప మునిసిపాలిటీకి చెడ్డ పేరు తెస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. మునిసిపాలిటీ పాలనలో వెంటనే మార్పు కన్పించాలని ఆదేశించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏదునూరి సీతరాములు, పీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు, పమ్మి అశోక్ పాల్గొన్నారు.

ప్రకృతి పుత్రుని కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ పర్యావరణవేత్త, పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య దశదిన కర్మ గురువారం జరగనున్న నేపథ్యంలో ఆయన కుటుంబానికి అర్థికంగా తోడుగా నిలవాలనే ఆద్దేశ్యంతో బీఆర్ఎస్ మాజీ లోక్‌సభపక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఆదేశాల మేరకు నామ ముత్తయ్య మెమోరియల్‌ట్రస్ట్ ద్వారా కొంత నగదు సహాయాన్ని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెల్లంవేణుగోపాల్ బుధవారం అందజేశారు. ఇటీవల రామయ్య ఇంటికి నామా వచ్చినపుడు వారి కుటుంబానికి అండగా ఉంటామని నామా చెప్పడం జరిగింది. అందులో భాగంగా ఈసాయాన్ని రామయ్య సతీమణి జానమ్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల రూరల్ అధ్యక్షుడు వేణుగోపాల్, నామా క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జి కనకమేడల సత్యనారాయణ, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా... ముగ్గురికి గాయాలు

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తా పడి ముగ్గురు కూలీలకు గాయాలైన సంఘటన మండలంలో బుధవారం ఉదయం జరిగింది. మండలంలోని ఆసుపాక గ్రామానికి చెందిన పది మంది కూలీలు వినాయకపురంలో అరటితోటలో పనికి ఆటోలో వస్తున్నారు. వినాయకపురంలో ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనం, ఆటో ఢీకొనటంతో ఆటో బోల్తాపడింది. ప్రమాదంలో భూక్యా సక్రు, బొడపాటి చిలకమ్మ, నార్లపాటి మరియమ్మకు పలుచోట్ల గాయాలయ్యాయి. క్షతగాత్రులను అశ్వారావుపేటలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పోలీసులు వివరాలు సేకరించారు.

తహసీల్దార్ కార్యాలయ అటెండర్ మృతి

తిరుమలాయపాలెం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): తిరుమలాయపాలెం తహసీల్దార్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న యాకుబ్‌పాషా (26) బుధవారం మృతిచెందాడు. ఖమ్మం రూరల్ మండలం ముత్తగూడెంకు చెందిన యాకుబ్‌పాషా నాలుగునెలల క్రితం విధుల్లో చేరాడు. అతను కామెర్ల వ్యాధితో బాధపడుతున్నాడు ఈ నేపథ్యంలో ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాదులోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. కాగా ముత్తగూడెంలో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. పాషా మృతికి తహసీల్దార్ సుధీర్, ఆర్ఐలు లక్ష్మణ్, వీరయ్య, డీటీ నరసింహారావు సంతాపం తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): అవమానభారంతో పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతిచెందాడు. ఎస్ఐ యయాతిరాజు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గుమ్మడివల్లి గ్రామానికి చెందిన మేకల నరేశ్(35) తన భార్య అదే గ్రామానికి చెందిన ప్రసాద్ అనే వ్యక్తితో ఫోన్ మాట్లాడుతోందంటూ ప్రసాద్‌ను ప్రశ్నించాడు.

దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరగ్గా ప్రసాద్ నరేశ్‌పై దాడికి పాల్పడ్డాడు. దీంతో ఈనెల 11న నరేశ్ గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు అశ్వారావుపేటలో చికిత్స అనంతరం వరంగల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నరేశ్ బుధవారం మధ్యాహ్నం మృతిచెందాడు. ఘటనపై మృతుడి తల్లి కన్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యయాతిరాజు వివరించారు. నరేష్ మృతితో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

యువతిని వేధిస్తున్న.. వ్యక్తిపై కేసు నమోదు

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో యువతిని వేధిస్తున్న యువకుడిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యయాతిరాజు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అశ్వారావుపేటలోని తూర్పుబజారుకు చెందిన జి. ఏసుబాబు అనే యువకుడు పట్టణానికి చెందిన 20 ఏళ్ల యువతిని ప్రేమ పేరుతో వేధిస్తూ పెళ్లిచేసుకోవాలని కోరుతున్నాడు. యువతికి వివాహం చేయటానికి కుటుంబసభ్యులు సంబంధాలు చూస్తుండగా యువకుడు తనను పెళ్లి చేసుకోకపోతే అంతు చూస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. యువకుడి వేధింపులు భరించలేక యువతి కుటుంబ సభ్యులకు తెలపగా బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు యువకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రపంచ తెలుగు సాహితీ.. సంబరాలకు సురేష్ బాబు

భద్రాచలం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): భద్రాచలానికి చెందిన ఫిజిక్స్ సైన్సు ఉపాధ్యాయుడు తోటమల్ల సురేష్‌బాబు ఏపీలోని ఏలూరు నగరంలో మే 10, 11 తేదీల్లో జరిగే ప్రపంచ తెలుగు సాహితి సంబరాలకు రావాల్సిందిగా ఆహ్వానించారు. ఈ మేరకు ఆహ్వాన పత్రికను తెలుగు సాహితి సంబరాల నిర్వాహకులు డా.కత్తిమండ ప్రతాప్, కొల్లి రమావతి, ఈశ్వరి భూషణం ఆహ్వానం పంపారని పేర్కొన్నారు.

భద్రాద్రి రామయ్యకు అభిషేకం, నిత్య కల్యాణం

భద్రాచలం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని సీతారామ చంద్రస్వామి వారికి బుధవారం సందర్భంగా అంతరాలయంలో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అలాగే స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేన పూజ, పుణ్యాహావచనం, కంకణదారణ, జీలకర్రబెల్లం, మాంగల్యదారణ వేద ఆశీర్వచనం వైదిక సిబ్బంది నిర్వహించారు.

దుమ్ముగూడెం అటవీ రేంజ్‌లో.. ఫారెస్ట్ విజిలెన్స్ డీఎఫ్‌వో పర్యటన

దుమ్ముగూడెం ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): దుమ్ముగూడెం అటవీరేంజిలో అటవీశాఖ విజిలెన్స్ డీఎఫ్ఓ ముకుంద్‌రెడ్డి బుధవారం పర్యటించారు. పర్ణశాల సెక్షన్ గడ్డోరుగట్టులోని పదిహేడు హెక్టార్ల మారుజాతి ప్లాంటేషన్, పర్ణశాల టేకు ప్లాంటేషన్, డికొత్తూరు బీటులోని పద మూడు హెక్టార్ల ప్లాంటేషన్లతోపాటు చర్ల మండలం పులిగుండాల సీపీ భూములను సందర్శించారు. అధికారులతో మాట్లాడి, వివరాలు తెలుసుకున్నారు. పర్ణశాల రాముడిని దర్శించుకున్నారు. నారచీరల ప్రాంతాన్ని సందర్శించారు. ఆలయ ప్రాశస్త్యాన్ని అర్చకులు వివరించారు. ఆలయ పరిసరాలను పరిశీలించారు. రేంజి అధికారి కమల, పర్ణశాల, దుమ్ముగూడెం, భోదనెల్లి సెక్షన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు వ్యక్తులకు.. ఆరు నెలల జైలుశిక్ష

భద్రాచలం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): భద్రాచలానికి చెందిన ముద్దా పిచ్చయ్య, మందల రవికుమార్ అనే వ్యక్తులకు భద్రాచలం ప్రధమ శ్రేణి న్యాయాధికారి శివనాయక్ ఆరు నెలల జైలుశిక్ష, రూ.500 జరిమాన విధిస్తూ బుధవారం తీర్పు వెల్లడించారు. 2019 నవంబరు నెలలో ఒక ఇంటి యజమాని తన ఇంటి పైకప్పు పనులు నిర్వహిస్తున్న సమయంలో పై ఇరువురు వ్యక్తులు వచ్చి బెదిరించారని ఆరోపిస్తూ 2019 నవంబరు 24న సదరు ఇంటి యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయగా వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు చార్జీషీటు దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయధికారి శివనాయక్ ఇరువురికి శిక్ష ఖరారు చేస్తూ తీర్పు వెల్లడించారు.



ఆస్పత్రిలో పార్కింగ్ స్థలం సిద్ధం

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఆస్పత్రికి వచ్చే సందర్శకులు, రోగులు, ప్రజల వాహనాలను పార్కింగ్ చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆస్పత్రి అధికారులు, వైద్యుల కోసం ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాన్ని సిద్ధం చేశారు. ఆస్పత్రి వెనుక భాగంలో సఖీ కేంద్రం పక్కనే రూ. 5లక్షలతో సువిశాలంగా ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ప్రత్యేక చొరవతో దీనికి నిధులు కేటాయించారు. పార్కింగ్ స్థలాన్ని అధికారులు సిద్ధం చేశారు. త్వరలో కలెక్టర్ చేతుల మీదుగా దీన్ని ప్రారంభించాలని ఆస్పత్రి అధికారులు యోచిస్తున్నారు.

నాడు డొంకదారి.. నేడు నాలుగు వరుసల రహదారి

ప్రభుత్వ మెడికల్ కాలేజీ, ఖమ్మం బైపాస్‌కు నేరుగా రోడ్డు

ప్రత్యేక చొరవ తీసుకున్న మంత్రి తుమ్మల

టీయూఎఫ్ఐడీసీ రూ.395 లక్షలతో బల్లేపల్లి నుంచి బాలపేట బైపాస్ వరకు నాల్గు వరసల రహదారి

రఘునాథపాలెం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఆ దారి నాడు డొంక దారి మాత్రమే.. ఖమ్మం నగరానికి సమీపంలోనే ఉన్నాకూడా ఆ రహదారిపై ఎందుకో గత ప్రభుత్వంలో శ్రద్ధ చూపలేదు. పెరుగుతున్న నగరం విస్తీరణంతో పాటుగా విలీన ప్రాంతాల అభివృద్ధిపై వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలోనే ఖమ్మం నగరంతో పాటుగా రఘునాథపాలెం మండలాన్ని ఎన్ని రకాలుగా అభివృద్ధి చేయాలో అన్ని రకాలుగా వ్యూహరచనలు చేశారు.

నేడు ఖమ్మానికి ప్రధాన రహదారిగా..

రఘునాథపాలెం మండలంతో పాటుగా ఖమ్మం బైపాస్ నుంచి రవాణా రాకపోకలు సాగాలంటే ఇల్లెందు రోడ్డు మాత్రమే ప్రధానంగా ఉంది. బాలపేట, బాలపేట తండాల నుంచి డొంకదారి మాత్రమే ఉండి బాలపేట గ్రామంలో రాకపోకలు ఇబ్బందిగా ఉండటంతో ఎక్కువగా రఘునాథపాలెం, బైపాస్ నుంచి రవాణా చేసే వారు ఇల్లెందు రహదారి లేదా వైరా రోడ్డును మాత్రమే వెళ్తున్నారు. ఖమ్మం రఘునాథపాలెం సరిహద్దులో ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. దీంతో పాటుగా రఘునాథపాలెం మండల కేంద్రంలో స్వామినారాయణ పాఠశాల, ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు నిర్మాణాలు జరుగుతున్నాయి. వీటితో పాటుగా ఆయిల్ ఫామ్ నుంచి అనేక అభివృద్ధి కార్యక్రమాలు ఇదే ప్రాంతంలో జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బల్లేపల్లి నుంచి బాలపేట, బాలపేట తండా నుంచి బైపాస్ వరకు ఉన్న డొంక రోడ్డు అభివృద్ధిపై దృష్టి సారించారు. రెండు గ్రామాల మధ్యలో నుంచి రహదారి నిర్మాణం జరగటంతో గ్రామస్థులను ఒప్పించి, వారికి సరైన న్యాయం చేస్తామని ఖమ్మం ఏఎంసీ మాజీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్ ఆధ్వర్యంలో గ్రామస్థులతో చర్చలు జరిపించారు. చివరకు టీయూఎఫ్ఐడీసీ రూ.395 లక్షలతో బల్లేపల్లి నుంచి బాలపేట తండా బైపాస్ రోడ్డు వరకు రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు జనవరి 24న శంకుస్థాపనలు చే శారు. బల్లేపల్లి నాల్గు వరసల రహదారిని అనుసంధానం చేస్తూ బాలపేట బైపాస్ వరకు రహదారి విస్తరణ పనులకు నిధులు మంజూరు చేశారు. నిధులు కేటాయించిన ఇంజనీరింగ్ అధికారులు బాలపేట, బాలపేట తండాలో నివాసాల మధ్యలో నుంచి వెళ్తున్న రహదారికి కల్వార్టులను మాత్రం మంజూరు చేయలేదు. దీంతో వెంటనే పనులు ప్రారంభించేందుకు అడ్డంకి ఏర్పడింది. మరోసారి సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లటంతో సమస్యకు పరిష్కారం ఏర్పడింది. దీంతో శరవేగంగా రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇక ప్రభుత్వ మెడికల్ కాలేజీతో పాటుగా రఘునాథపాలెం మండలం, ఖమ్మం బైపాస్‌కు వెళ్లేందుకు మార్గం సుగమంగా మారింది.



బాలపేట బైపాస్ నుంచి ఖమ్మం నగరంలోకి రహదారి



వేగంగా జరుగుతున్న నిర్మాణ పనులు

ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్).. పట్టణ అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ ఎన్నిక



ఖమ్మం లీగల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం బార్ అసోసియేషన్‌తో పాటు జిల్లాలో వివిధ బార్ అసోసియేషన్ లో జరిగిన ఎన్నికల్లో ఐఏఎల్ తరఫున గెలిచిన వారిని బుధవారం జరిగిన ఐఏఎల్ ఖమ్మం జిల్లా కమిటీ సమావేశంలో వివిధ బార్ అసోసియేషన్‌లలో గెలుపొందిన సభ్యులను ఘనంగా సత్కరించారు. అనంతరం ఐఏఎల్ పట్టణ కమిటీ ఎన్నిక జరగగా పట్టణ అధ్యక్షుడిగా జీ.వీ.లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా ముమ్మడి సతీష్ ఎన్నికయ్యారు. వారితోపాటు ఆఫీస్ బేరర్లను, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐఏఎల్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు షేక్ లతీఫ్, గౌరవఅధ్యక్షుడు పారుపల్లి అమర్‌చంద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఓరుగంటి శేషగిరిరావు, షేక్ నస్రీన్ పాల్గొన్నారు.

ఉగ్రదాడికి ఖమ్మం 'బార్' ఖండన

ఖమ్మం లీగల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జమ్మూకాశ్మీర్‌లో మంగళవారం ఉగ్రవాదుల దాడిని ఖమ్మం బార్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఇలాంటి చర్యలు తిరిగి భవిష్యత్తులో పునరావృతం కాకుండా భారత ప్రభుత్వం తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని, ఉగ్రవాదుల పట్ల కఠినంగా వ్యవహరించాలని, పర్యాటకులకు పూర్తి రక్షణ కల్పించాలని కోరారు. ఈ ఘటనలో చనిపోయిన ప్రతీ ఒక్కరికి ప్రగాఢ సానుభూతిని, సంతాపం తెలియజేశారు. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే అన్ని రకాల సహాయ సహకారాలను అందించాలని కోరారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తొండపు వెంకటేశ్వరరావు, కార్యదర్శి గద్దల దిలీప్‌కుమార్, తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్లపూడి రామారావు, కాకర్లరి లక్ష్మీనరసింహారావు, ముప్వా నాగేశ్వరరావు, బీజేపీ న్యాయవాద పరిషత్ నాయకులు సుగ్గల వెంకటేశ్వరరావు గుప్తా, తెల్లాకుల రమేష్‌బాబులు ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండించారు.

చదువుతోపాటు కళలపై ఆసక్తి పెంచుకోవాలి

ఖమ్మం ఖానాపురం హవేలి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): బాల బాలికలు చదువు తోపాటు కళలపై ఆసక్తి పెంచుకోవాలని కళాపరిషత్ అధ్యక్షుడు నాగబత్తిని రవి అన్నారు. బుధవారం నగరంలోని అంబేద్కర్ భవన్‌లో తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, యూనిక్ థియేటర్ ఆధ్వర్యంలో 45 రోజుల ఉచిత థియేటర్ యాక్టింగ్ వర్క్ షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నటనా కౌశల్యంతో మంచి గుర్తింపు పొందవచ్చునని అన్నారు.

టీపీబీవో పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా బుధవారం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో టీపీబీవో పుస్తకాన్ని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ నూతనంగా టీజీపీఎస్సీ ద్వారా ఉద్యోగంలో చేరిన పట్టణ ప్రణాళిక అధికారులకు తమ విధులపై ప్రాథమిక విషయ పరిజ్ఞానం కోసం టీపీబీవో పుస్తకం ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. పుస్తకంలో పూర్తిస్థాయిలో అవగాహన కలిగేలా రూపొందించారని పుస్తక సంకలనం చేసిన సుడా ఉద్యోగి ఇటికాల భాస్కర్‌ను కమిషనర్ అభినందించారు. సీపీవో రాజ్‌కుమార్, ఏసీపీ గంధం వసుంధర, ఏపీవో ఖాదర్, టీపీఎస్ నరేశ్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల శిక్షణ పూర్తి



శిక్షణ ఇస్తున్న దృశ్యం

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ, తెలంగాణ భాగస్వామ్యంతో ఖమ్మం ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ శిక్షణ కార్యక్రమంలో తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం, 2018 ప్రకారం గ్రామ సభ పాత్ర, మెరుగైన స్థానిక పాలన కోసం ప్రజల భాగస్వామ్యంతో పాలనను ప్రోత్సహించడంసమాచార హక్కు చట్టం, స్వచ్ఛందంగా సమాచారం వెల్లడించడం ద్వారా పారదర్శకతను ప్రోత్సహించడం మహిళా సాధికారత, చట్టాల వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లాకు చెందిన 26 మంది పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. రిసోర్స్ పర్సన్స్ రోజారాణి, వేణుగోపాల్ రెడ్డి, శ్రీదేవి, అశోక్ కుమార్ రెడ్డి, మురహరి తదితరులు కార్యదర్శులకు బోధించారు.

ఉద్యోగుల సదస్సును విజయవంతం చేయాలి

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 25న నిర్వహించనున్న ఉద్యోగుల సదస్సును విజయవంతం చేయాలని టీఎన్జీవో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదెన శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఖమ్మంలో జరిగే బైక్ ర్యాలీ, ఉద్యోగుల సదస్సును మహిళా ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. బుధవారం టీఎన్జీవో భవనంలో ఖమ్మం జిల్లా ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీలోని అన్ని ఉద్యోగ సంఘాల మహిళా విభాగం నాయకులు, మహిళా ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఖమ్మంలో జరిగే బైక్ ర్యాలీని, ఉద్యోగుల సదస్సును మహిళా ఉద్యోగులు అధిక సం ఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యం మంజూరులో జాప్యం,5 డి.ఏలు పెండింగ్ ఉండటం భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేదని కేంద్ర ప్రభుత్వం ద్రవ్యోల్బణ రేటును బట్టి కరువు భత్యాన్ని సవరిస్తూ ఎప్పటికప్పుడు డీఏలు మంజూరు చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో వెనుకబడి ఉందని దీని వలన ఉద్యోగులు ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ మహిళా కార్యదర్శి సుధారాణి, టిఎన్జీవోస్ యూనియన్ ఉపాధ్యక్షురాలు ఎస్. లలిత కుమారి, సహాయ కార్యదర్శి ఎస్ రాధికా రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఎస్.విజయ టీఎన్జీవోస్ మహిళా విభాగం చైర్పర్సన్ జి .మృదుల, కన్వీనర్ బీవి. సుబ్బమ్మ, పద్మలత డి అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

కాశ్మీర్లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడిని టీఎన్జీవో నాయకులు తీవ్రంగా ఖండించారు. పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేయడాన్ని పిరికిపంద చర్యగా గుంటుపల్లి శ్రీనివాసరావు, కన్వీనర్ కస్తాల సత్యనారాయణ తీవ్రంగా ఖండించారు. కాల్పుల్లో మృతి చెందిన వారికి సంతాప సూచకంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళి అర్పించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ కార్యదర్శి కొణిదెన శ్రీనివాస్, టీజీవోస్ కార్యదర్శి మోదుగు వేలాద్రి టీఎన్జీవోస్ యూనియన్ జిల్లా కార్యవర్గం మరియు టీజీఓస్ జిల్లా కార్యవర్గం, మహిళా విభాగం నేతలు పాల్గొన్నారు.



కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

భరతనాట్యం చిన్నారులకు పరీక్షలు పూర్తి



సన్మానం పొందిన వారితో చిన్నారులు

ఖమ్మం ఖానాపురంహవేలి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ నృత్యం భరతనాట్యం నేర్చుకుంటున్న చిన్నారులకు చండీగడ్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని వండర్ కిడ్స్ పాఠశాలలో నృత్య శాస్త్రంలో ప్రారంభిక, భూషణ్ విభాగాలలో వార్షిక పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలు భరతనాట్యంలో మాస్టర్ పీహెచ్‌డీ పూర్తి చేసిన ప్రతిమ ఆధ్వర్యంలో జరిగాయి.ఈ పరీక్షలకు నగరంలోని అభినయ రుద్ర నాట్యాలయ చిన్నారులు వార్షిక పరీక్షలకు, ప్రాక్టికల్స్‌కు హాజరైనారు. అనంతరం పర్యవేక్షకురాలు ప్రతిమను అభినయ రుద్ర నాట్యాలయ గురువు కణతాల ఫణిల్‌ను నాట్యాలయ విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

దరఖాస్తులను సత్వరమే పరిష్కరించండి

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

నేలకొండపల్లి, ఏప్రిల్23(ఆంధ్రజ్యోతి): భూభారతి చట్టం అవగాహన సదస్సుల్లో రైతులు ఇస్తున్న దరఖాస్తులను సత్వరమే పరిష్కరించటానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. గురువారం మండలంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటన నేపథ్యంలో బుధవారం నేలకొండపల్లి వచ్చిన కలెక్టర్ తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈనెల 17నుంచి ప్రారంభమైన రెవెన్యూ అవగాహన సదస్సుల్లో వివిధ గ్రామాల్లో ఇప్పటి వరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? ఏ సమస్యలపై ఎక్కువగా వచ్చాయి? వచ్చిన దరఖాస్తుల్లో సత్వరమే పరిష్కరించగలిగేవి ఎన్ని ఉన్నాయి? అంటూ అధికారులను ప్రశ్నించారు. వచ్చిన దరఖాస్తులన్నింటినీ రిజిష్టర్‌లో ఒక్రమ పద్దతిలో నమోదు చేస్తున్నారా? అంటూ అడిగి తెలుసుకున్నారు. గురువారం ముజ్జుగూడెంలో జరుగనున్న భూభారతి చట్టం అవగాహన సదస్సులో రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొంటున్నందున అన్ని ఏర్పాట్లు సక్రమంగా చేయాలని, ఎటువంటి లోటుపాట్లు ఉండకూడదని ఆదేశించారు.

ఐక్యంగా ఉగ్రవాదాన్ని తుడిచిపెట్టాలి: నెల్లూరి



కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న బీజేపీ నేతలు

ఖమ్మం బైపాస్‌రోడ్డు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సైనిక దుస్తుల్లో వచ్చి హత్యాకాండకు పాల్పడటం ఉగ్రవాదుల పిరికిపంద చర్యకు నిదర్శనమని బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు ధ్వజమెత్తారు. కాశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా పహల్గాంలో విహారినికి వెళ్లిన 26 మంది హిందువులను పాకిస్తాన్ ఉగ్రవాదులు పొట్టన పెట్టుకోవడాన్ని నిరసిస్తూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నగరంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ నుంచి మయూరి సెంటర్ మీదుగా ట్రాఫిక్ సిగ్నల్ వరకు కొవ్వొత్తుల నరసన ప్రదర్శన నిర్వహించి అక్కడ పాక్ ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉగ్రవాదాన్ని ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, నల్లగట్టు ప్రవీణ్‌కుమార్, రవికుమార్, మందడపు సుబ్బారావు, తొడుపునూరి రవీందర్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు టేకుమట్ల వీరగౌడ్, రేఖ సత్యనారాయణ, వేల్పుల సుధాకర్, బోయినపల్లి చంద్రశేఖర్, కందుల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రెజొనెన్స్ శ్రీనగర్‌లో రెజో కేజీ వేడుకలు



విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

ఖమ్మం ఖానాపురంహవేలి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీనగర్‌కాలనీ రెజొనెన్స్‌లో బుధవారం రెజొ కేజీ, పర్విటటి గ్రాడ్యుయేషన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసరావు, పాఠశాల డైరెక్టర్లు కొండ శ్రీధర్‌రావు, కృష్ణవేణి హాజరై జ్యోతిప్రజ్వల చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ముఖ్య అతిథి చేతుల మీదుగా విద్యార్థులకు స్నాతకోత్సవ పట్టాలు అందించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

విశ్వహిందూ పరిషత్ శాంతి ర్యాలీ

ఖమ్మం ఖానాపురం హవేలా, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జమ్మూకాశ్మీర్ పహల్గాం దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన హిందూవులకు నివాళ్లు అర్పిస్తూ బుధవారం నగరంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ నుంచి విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. మతం అడిగి మరీ ప్రాణాలను తీసిన ఉగ్రవాదులును తక్షణమే శిక్షించాలని కోరుతూ శాంతి ర్యాలీ నిర్వహించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ నాయకులు పాల్గొన్నారు.

ఆడపిల్లతోనే ఇంటికి పరిపూర్ణత

» కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



చిన్నారిని ఎత్తుకున్న జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

మధిరరూరల్, ఏప్రిల్23(ఆంధ్రజ్యోతి): ప్రేమానురాగాలకు ప్రతీకైన అమ్మాయి పుడితే ఇంటికి పరిపూర్ణత వస్తుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. బుధవారం మండలంలోని దెందుకూరు గ్రామంలోని మా పాప మా ఇంటి మణిదీపం కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో షేక్ సుహానా, సమీర్ దంపతులకు రెండో ఆడపిల్ల జన్మించింది. జిల్లా కలెక్టర్ వారి ఇంటికి వెళ్లి పాప తల్లిదండ్రులను సన్మానించారు. ఈకార్యక్రమంలో జిల్లాసంక్షేమ అధికారి కె.రాంగోపాల్‌రెడ్డి, సీడీపీవో బాలత్రిపురసుందరి జిల్లా మిషన్ కో ఆర్డినేటర్ సమీన్, తహసీల్దార్ రాళ్లబండి రాంబాబు, మండల అభివృద్ధి అధికారి బి.వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

భయంకరమైన ఉగ్రవాద దాడి

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): లష్కరే తోయిబా అనుబంధ సంస్థ ది రెసిస్టెన్స్ ఫ్రంట్ అత్యంత దుర్మార్గంగా మంగళవారం పహల్గాంలో భయంకరమైన ఉగ్రవాది దాడికి పాల్పడిందని ఇటువంటి సంఘటనలను ప్రతి పౌరుడు తీవ్రంగా ఖండించాలని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు కోరారు. జమ్ముకశ్మీర్‌లో జరిగిన సంఘటనను ఆయన బుధవారం ఖండించారు. మాస్‌లైన్ కేంద్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. మొత్తం 26మంది అమాయక ప్రజలు తమ ప్రాణాలను కొల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. గాయపడిన వారు త్వరగా కొలుకోవాలని ఆకాంక్షించారు. కేంద్ర ప్రభుత్వం ఆర్టిక్ 370ను రద్దు చేసి పూర్తి స్థాయిలో రాష్ట్రాన్ని కేంద్రాపాలిత ప్రాంతంగా మార్చటం రాజకీయ సమస్యకు సరైన సమాధానం కాదన్నారు. ఇటువంటి సంఘటనలు జరగటం బాదాకరమన్నారు.

హక్కుల సాధనకు దశలవారీ ఉద్యమం

ఖమ్మం ఖానాపురం హవేలి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మైనారిటీ హక్కుల సాధన జరగాలంటే గాంధేయవాద ఐక్య ఉద్యమాలతోనే సాధ్యమని ప్రముఖ వైద్యులు కూరపాటి ప్రదీప్, కెవి కృష్ణారావు, ప్రసేన్, ఖమ్మం రూరల్ సీఐ రాజు, సయ్యద్ సాదిక్ అలి అన్నారు. బుధవారం నగరంలోని సంఘం కార్యాలయంలో నాలుగు మండలాల సన్నాహక సమావేశంలో ముఖ్య అతిదులు హాజరై మాట్లాడారు. మైనారిటీల హక్కుల సాధన, వక్ఫ్ బూముల సవరణ చట్టం రద్దు అంశాలలో రాజ్యంగ పరిరక్షన వేదిక ఫౌండర్ గాంధేయ మార్గంలో శాంతియుతంగా ఉద్యమిస్తామన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ఈ వేదిక కార్యక్రమాల నిర్వహణ ఉంటుందని అన్నారు. వక్ఫ్ బోర్డు బిల్లును కేంద్ర ప్రభు త్వం వెంటనే రద్దు చేయాలని కోరారు. బహుజనులంతా ఈ వేదిక ద్వారా శాంతి మార్గంలో సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు పాల్గొన్నారు.

రేపటినుంచి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఎస్ఎఫ్ఐ 5వ రాష్ట్రమహాసభలు ఈ నెల 25 (శుక్రవారం) నుంచి 27వరకూ జరగనున్నాయి. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి, టి.నాగరాజు ఖమ్మం జిల్లా కార్యదర్శి టి. ప్రవీణ్, జిల్లా అధ్యక్షుడు డి.వెంకటేష్ బుధవారం ఏర్పాటు చేసిన విలేరుల సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర 5వ మహాసభలు ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో నిర్వహించ నున్నట్లు వారు తెలిపారు.

ఆడపిల్లతోనే ఇంటికి పరిపూర్ణత

కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

మధిరరూరల్, ఏప్రిల్23(ఆంధ్రజ్యోతి): ప్రేమానురాగాలకు ప్రతీకైన అమ్మాయి పుడితే ఇంటికి పరిపూర్ణత వస్తుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. బుధవారం మండలంలోని దెందుకూరు గ్రామంలోని మా పాప మా ఇంటి మణిదీపం కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో షేక్ సుహానా, సమీర్ దంపతులకు రెండో ఆడపిల్ల జన్మించింది. జిల్లా కలెక్టర్ వారి ఇంటికి వెళ్లి పాప తల్లిదండ్రులను సన్మానించారు. ఈకార్యక్రమంలో జిల్లాసంక్షేమ అధికారి కె.రాంగోపాల్‌రెడ్డి, సీడీపీవో బాలత్రిపురసుందరి జిల్లా మిషన్ కో ఆర్డినేటర్ సమ్రిన్, తహసీల్దార్ రాళ్లబండి రాంబాబు, మండల అభివృద్ధి అధికారి బి.వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగారంలోని ఎస్టీ కాలనీలో ఆడబిడ్డను జన్మనిచ్చిన సోయం మహేష్, స్వప్న, వారి కుటుంబ సభ్యులను మండల స్పెషలాఫీసర్ పీ.సునీల్‌రెడ్డి సన్మానించారు.

వైరా, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనకగిరి సిరిపురంలో ఆడపిల్లకు జన్మనిచ్చిన నజీమా, తాజుద్దీన్ దంపతులను మండల ప్రత్యేక అధికారి కస్తాల సత్యనారాయణ, ఎంపీడీవో సరస్వతీ సన్మానించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సరిత, బీజాన్ బీ, శ్రీలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు ప్రమీల, రాజేశ్వరి, అన్నపూర్ణ, మార్తమ్మ పాల్గొన్నారు.

బోనకల్: మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో బుధ వారం మా ఇంటి మణిదీపం కార్యక్రమంలో బాగంగా షేక్ ఫయాజ్, జాన్‌బీ దంపతులను తహసీల్దార్ పున్నం చందర్, ఎంపీడీవో ఆర్.రమాదేవిలు సన్మానించి, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గిర్దావర్ మైథిలీ, ఎంపీవో శాస్త్రీ, హెల్త్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పెనుబల్లి: కల్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని లంకపల్లి సర్కిల్‌లో రామచంద్రరావుబంజర్‌లో ఇమ్మడి సాధిక, రంజిత్ దంపతులకు ఆడపిల్ల జన్మించిన సందర్భంగా ఎంపీడీవో అన్నపూర్ణ వారిని సన్మానించారు.

కల్లూరు: మండల పరిధిలోని పెద్దకోరుకొండి గ్రామంలో ఆడబిడ్డను జన్మచ్చిన బొగ్గుల దివ్య, వీరనరేంద్రరెడ్డిలను మండల ప్రత్యేక అధికారణి సునీత సన్మానించారు.


చిన్నారిని ఎత్తుకున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్


వైరాలో...


సత్తుపల్లిరూరల్‌లో...


పెనుబల్లిలో...

భూ భారతితో సమస్యలు పరిష్కారం

డీఆర్వో పద్మశ్రీ

ఎర్రుపాలెం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టంతో సమస్యలు పరిష్కారం అవుతాయని డీఆర్వో ఏ.పద్మశ్రీ అన్నారు. మండలంలోని జమలాపురం గ్రామంలో వాసిరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో బుధవారం భూ భారతి చట్టంపై రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ కొత్త చట్టంలో రెవెన్యూ అధికారులు అందించిన ఆర్డర్లపై అప్పీల్ చేసుకునే అవకాశం ఉందన్నారు. గతంలో ధరణి ఉన్నప్పుడు ఏదైనా అభ్యంతరాలుంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సిఉండేదని, ఆ అవసరం లేకుండా అప్పీల్‌కు అవకాశం కలిపించిదన్నారు. ఈసదస్సులో జిల్లాపంచాయతీ అధికారి ఆశాలత, మధిర మార్కెట్ చైర్మన్ బం డారు నరసింహారావు, తహసీల్దార్ మన్నె ఉషాశారద, మండల ప్రత్యేక అధికారి, మధిర వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు విజయచంద్ర, ఎంపీడీవో సురేందర్, ఏవో సాయిశివ, ఆర్‌ఐలు రవి కుమార్, రాజశేఖర్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డీఆర్వో పద్మశ్రీ

'ధాన్యం కొనుగోలు చేయడం లేదని ఫిర్యాదు'

పెనుబల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): తాము పండించిన ధాన్యాన్ని ఐకేపీ కేంద్రంలో కొనుగోలు చేయటం లేదని కొత్తకారాయిగూడెం గ్రామ రైతులు ఐకేపీ గ్రామదీపికపై ఎంపీడీవో అన్నపూర్ణ, ఐకేపీ ఏపీఎం జ్యోతిలకు బుధ వారం ఫిర్యాదు చేశారు. రైతుల ధాన్యాన్ని కాంటా వేయకుండా గ్రామదీపిక ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ తమను దూషిస్తుందని ఫిర్యాదు చేశారు. కొత్తకారాయిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో ఐకేపీ కేంద్రాన్ని తక్కువ స్థలంలో ఏర్పాటు చేయడం వలన తాము తీసుకువచ్చిన ధాన్యాన్ని ఆరబోసేందుకు వీల్లేకపోవడంతో రోడ్డుపై ఆరబోశామని ఆధాన్యాన్ని కాంటా వేసుకోవటానికి ఐకేపీ గ్రామదీపిక భూక్యా ప్రసన్న ఐకేపీ కేంద్రానికి తీసుకురావాలని లేదంటే కాంటా వేయమని చెపుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అకాల వర్షాలతో ఇప్పటికే నష్టాలపాలయ్యామని, వచ్చిన కొద్దిపాటి ధాన్యాన్ని కూడా కాంటా వేయటం లేదని వాపోయారు.రైతులు దొడ్డపనేని రవికుమార్, పోట్రు కృష్ణయ్య, నూనె కేశవర్ధన్‌రావు, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ఉద్యోగుల ర్యాలీని విజయవంతం చేయండి

కొణిజర్ల, ఏప్రిల్23(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 25న కలెక్టరేట్ కార్యాలయం నుంచి టీఎన్‌జీవోఎ ఫంక్షన్ హాల్ వరకు నిర్వహించే బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వీరస్వామి, ప్రసాద్ రావులు ఒక ప్రకటనలో కోరారు.

తల్లాడ: ఉద్యోగులకు రావాల్సిన రాయితీలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 25నఖమ్మంలో జరిగే బైక్‌ర్యాలీని జయప్రదం చేయాలని టీఎన్జీవో కల్లూరు డివిజన్ అధ్యక్షుడు కె. పెద్దపుల్లయ్య కోరారు. బుధవారం మండలంలోని మండల ప్రజాపరిషత్ తహసీల్దార్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉద్యోగులను కలిసి ప్రచారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో సురేష్, ఏసీడీపీవో నవ్యశ్రీ, సీహెచ్‌వో భాస్కర్, సూపరింటెండెంట్ వాణిశ్రీ, ఈవో కృష్ణారావు, మధుకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలి : ఎంఈవో

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్23 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో విద్యార్థులు బావులు, చెరువుల వద్దకు తల్లీదండ్రులకు తెలియకుండా జాగ్రత్తగా ఉండాలని ఎంఈఓ నక్కా రాజేశ్వరరావు సూచించారు. బుధవారం పాఠశాలలకు చివరి పనిదినం కావడంతో విద్యార్థులకు తాము హాజరైన వివిధ పరీక్షలు, సహపాఠ్య కార్యక్రమాలకు సంబంధించిన మార్కులతో కూడిన ప్రోగ్రెస్ కార్డులను అందజేశారు. అదేవిధంగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ ఏర్పాటు చేసి అన్ని తరగతుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు తల్లిదండ్రుల చేతులమీదుగా బహుమతులను అందజేశారు. సోషల్ మీడియా, ఆన్‌లైన్ వీడియో గేములకు దూరంగా ఉండాలన్నారు. నేటి నుంచి జూన్ 11వరకు కొనసాగుతాయని, మరుసటి రోజు పునఃప్రారంభమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ సభకు భారీగా తరలిరండి: సండ్ర


మాట్లాడుతున్న సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అస్థిత్వాన్ని హిమాలయాల స్థాయికి చేర్చిన ఘనత కేసీఆర్ దక్కుతుందని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. బుధవారం సత్తుపల్లిలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈనెల 27వ తేదీన హన్మకొండ జిల్లాలోని ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కూసంపూడి మహేష్, దొడ్డా శంకరరావు, యాగంటి శ్రీనివాసరావు, మల్లూరు అంకంరాజు, నరుకుళ్ల శ్రీను, అద్దంకి అనిల్, పర్వతనేని వేణు తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లి, ఏప్రిల్23(ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా ఎల్కతుర్తి గ్రామంలో ఈనెల 27న జరగనున్న బీఆర్‌ఎస్ పార్టీ రజోత్సవ సభను విజయవంతం చేయాలని జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతమధు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈకార్యక్రమంలో వైరా ఆత్మకమిటీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ, మాజీ వైఎస్ ఎంపీపీ రావూరి శ్రీనివాస్‌రావు, సొసైటీ ఉపాధ్యక్షుడు ధారవత్ మంగీలాల్, యువజన నాయకులు జూపల్లి రాము, బత్తుల శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

వైరా, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలడుగు హైస్కూల్ విద్యార్థులకు తమ తల్లిదండ్రులు శ్రీరామనేని భద్రయ్య, సుగుణమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు హన్మంతరావు, శ్రీనివాసరావులు బుధవారం నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా పా ల్గొని ఈ నోట్‌పుస్తకాలను పంపిణీ చేశారు. స్వీట్లు కూడా పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు ఇమాన్యుల్, గ్రామస్థులు తిరుపతమ్మ, శ్రీనివాస్, చైతన్య పాల్గొన్నారు.

చెన్నూరులో బడిబాట

కల్లూరు, ఏప్రిల్23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెన్నూరు గ్రామంలో ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం దంతాల సుధాకర్ తనతో పాటుగా విద్యార్థులు కలసి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాన వీధుల్లో ప్లేకార్డులు చేత పట్టుకొని మైక్ ద్వారా ప్రచారం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పని సరిగ్గా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ జి సునీత, ఎస్ రాంబాబు తదితరులున్నారు.

గీత కార్మికుడికి పరామర్శ

పెనుబల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పార్థసారధిపురంలో ఇటీవల ప్రమాదవశాత్తూ తాటిచెట్టు పైనుంచి పడి చికిత్స పొందుతున్న కళ్లెం బిక్షాన్ని అతని ఇంటి వద్ద బుధవారం గౌడసంఘం నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా జై గౌడసంఘం జిల్లా అధ్యక్షుడు వేముల నర్సింహారావు మాట్లాడారు. ఆర్థికసాయం అందజేశారు. బజ్జూరి నాగేశ్వరరావు, వేముల రవికుమార్, మల్లెల శ్రీనివాసరావు, జిల్లేళ్ల శ్రీనివాసరావు, జిల్లేళ్ల కృష్ణ పాల్గొన్నారు.

లాప్‌టాప్ అందజేత


లాప్‌టాప్‌ను అందజేస్తున్న మాజీ జడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్

కల్లూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దకోరుకొండి ప్రభుత్వ పాఠశాలకు మాజీ జడ్పీటీసీ, బీఆర్‌ఎస్ నాయకుడు కట్టా అజయ్‌కుమార్ బుధవారం లాప్టాప్‌ను అందజేశారు. మధిర మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ కట్టా వెంకటనరసయ్య జ్ఞాపకార్థంగా వారి కుటుంబ సభ్యులు రూ.70 వేల విలువ గల లాప్టాప్‌ను వితరణ జేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నామా కృష్ణమూర్తి, మాజీ సర్పంచు వేము రత్తమ్మ, మాజీ ఎంపీటీసీ చిట్టిబాబు, స్థానిక ప్రముఖులు మచ్చా హనుంతరావు, ఇసాక్ వెంకటరెడ్డి, జ్యేష్ట వెంకట్వేరరావు, శ్రీనివాసరెడ్డి, అచ్చయ్య, సందర్, మురళికృష్ణ, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలకు మైకు సెట్ వితరణ

వైరా, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ ఏడోవార్డులోని బ్రాహ్మణపల్లి అగ్రహారం పిషరీస్ కాలనీ ప్రాథమిక పాఠశాలకు బుధవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రూ.12వేల విలువైన మైకుసెట్‌ను డాక్టర్ కాపా మురళీకృష్ణ అందజేశారు. లయన్స్‌క్లబ్ నిర్వాహకుడు ఉండ్రు శ్యాంబాబు చొరవతో ఈ మైకుసెట్‌ను వితరణగా అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రానికి కావల్సిన సౌకర్యాలను సమకూర్చారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెలిశెట్టి నర్సింహారావు, లయన్స్‌క్లబ్ నిర్వాహకులు ఉండ్రు శ్యాంబాబు, లగడపాటి ప్రభాకర్‌రావు, పెనుగొండ ఉపేంద్రరావు, వై.బుచ్చిరామారావు, పోటు మధుసూదన్‌రావు, చింతలపూడి వెంకటేశ్వరరావు, ఏఎపీసీ చైర్మన్ రజిని, ఉపాధ్యాయుడు రామకృష్ణ, అంగన్‌వాడీ టీచర్ పాతిమా పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం

వైరా/తల్లాడ/సత్తుపల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జమ్మూకాశ్మీర్‌లో హిందువులపై ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ పలు పార్టీల నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉగ్రవాదుల దాడికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు.

కంఠమహేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠ


పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

కొణిజర్ల, ఏప్రిల్23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొండవనమాల గ్రామంలో నూతనంగా నిర్మించిన కంఠమహేశ్వరస్వామి, సూరమాంబదేవిల ఆలయ విగ్రహ ప్రతిష్ఠామహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. శ్రీబాలాజీ ఎస్టేట్ అధినేత వత్సవాయి రవి ఆధ్వర్యంలో ఆయన తల్లిదండ్రులు వత్సవాయి వెంకయ్య, సీతారావమ్మ జ్ఞాపకార్థం గ్రామంలో నూతన ఆలయాన్ని నిర్మించారు. ఆలయంలో దేవతా విగ్రహాల ప్రతిష్ఠలకు ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంప్ ఇన్‌చార్జి దయాకర్‌రెడ్డి పలువురు రాజకీయ నాయకులు పాల్గొని పూజలు చేశారు. ఆలయంలో సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

మదర్‌థెరిస్సాలో క్యాంపస్ ఇంటర్వ్యూలు


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

సత్తుపల్లి, ఏప్రిల్23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ మెడ్‌ప్లస్ కంపనీ బుధవారం మండలంలోని కొత్తూరులోని మదర్‌థెరిస్సా ఫార్మసీ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా తమ కళాశాల నుంచి 38మంది విద్యార్థులు క్యాంపస్ డ్రైవ్‌లో పాల్గొనగా అందరూ ఎంపికైనట్లు కలాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చల్లా శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మెడ్‌ప్లస్ సీనియర్ ఎగ్జిక్యూటీవ్ ఎండీ.తాజుద్దీన్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కుమార్‌రాజా జయవరపు, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ దాసరి ప్రవీణ్‌కుమార్, క్లాస్ ఇంచార్జీ గంటా మానసలు డ్రైవ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల చైర్మన్ కంచర్ల సత్యనారాయణ, సెక్రటరీ, కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు అభినందించారు.

నేడు బోనకల్‌లో భూ భారతిపై సదస్సు

బోనకల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): బోనకల్ ఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో గురువారం భూ భారతి చట్టం పై అవగాహన సదస్సు నిర్వహించడం జరుగుతుందని తహసీల్దార్ పున్నం చందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

25న వైరాలో

వైరా, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వైరాలోని కామిశెట్టి కల్యాణ మండపంలో భూభారతి చట్టంపై ఈనెల 25న అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు తెలిపారు. ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పాల్గొంటారని తెలిపారు. రైతులు సకాలంలో హాజరై సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కాంగ్రెస్ పార్టీకి రుణపడి ఉంటాం

సత్తుపల్లి, ఏప్రిల్23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీకి మాదిగలు రుణపడి ఉంటారని ఎస్సీ కార్పోరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి అన్నారు. మాదిగలకు 9శాతం రిజర్వేషన్ కల్పించినందుకు బుధవారం సత్తుపల్లి పట్టణంలోని అంబేద్కర్ కాంస్య విగ్రహం వద్ద సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ మిఠాయిలు తినిపించి సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో వక్కలగడ్డ చంద్రశేఖర్, హెచ్చు హరీష్, మీసాల మహేష్, కోడిగుడ్ల నాగేశ్వరరావు, రాచూరి నాగేశ్వరరావు, మోహనరావు, కృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం

కారేపల్లి, ఏప్రిల్(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కేజీబీవీ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని ఇంటర్ ప్రథమ ఫలితాల్లో 461మార్కులతో మండల టాపర్‌గా నిలిచిన వైశాలిని బుధవారం కళాశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల స్పెషల్ ఆఫీసర్ ఝాన్సీసౌజన్య మాట్లాడారు. కార్యక్రమంలో బి.వసంత, ఎండీ సమీనాకౌసర్, బి.రమ, ఎం.విజయ, జి.అన్నపూర్ణ, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి: సీడీపీవో

ఏన్కూరు, ఏప్రిల్23(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు ఎక్కువగా పౌష్టికాహారం కలిగిన పాలు, గుడ్లు,పండ్లు, ఆకుకూరలు తీసుకోవాలని సీడీపీవో దయామణి కోరారు. బుధవారం మండలంలోని సూర్యతండా అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ్‌పక్వాడ్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో ఎస్. రమేష్, సూపర్‌వైజర్ ఎం.బక్కమ్మ పాల్గొన్నారు.